www.udyamakeratam.com

ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత: UDYAMA KERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 143 | 17-11-2026 | మంగళవారం | పేజీలు: 8 | వెల : రూ.2/-



చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో భారీ అగ్ని ప్రమాదం!

- ఖాళీ రైలు బోగీల్లో ఒక్కసారిగా చెలరేగిన అగ్ని
- 5, 6 ప్లాట్‌ఫారాల మధ్య నిలిపిన కోచ్‌లకు మంటలు
- ఆకాశాన్ని కమ్మేసిన దట్టమైన పొగలు
- భయాందోళనకు గురైన ప్రయాణికులు
- రైల్వే సిబ్బంది అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
- ప్రాణనష్టం లేదని వెల్లడించిన అధికారులు

హైదరాబాద్‌లోని చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్టేషన్‌లోని 5, 6 నంబరు ప్లాట్‌ఫారాల మధ్య నిలిపి ఉంచిన ఖాళీ రైలు బోగీల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు పక్కనున్న ఇతర బోగీలకు వ్యాపించడంతో దట్టమైన పొగలు ఆకాశాన్ని కమ్మేశాయి. ఈ ఘటనతో స్టేషన్ ప్రాంగణంలో ఉన్న ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బోగీల నుంచి మంటలు, పొగలు రావడాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది వెంటనే అప్రమత్తమై ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మంటలు ఇతర రైళ్లకు, స్టేషన్ ఆస్తులకు వ్యాపించకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు.

వివరాలు 2వ పేజీలో



గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై కాంగ్రెస్ కసరత్తు

- సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం
- పద్మశాలి, ముదిరాజ్, మున్నూరు కాపులకు రెండు స్థానాలు?
- మూడో స్థానం ఎవరికి దక్కుతుందనే దానిపై ఉత్కంఠ

హైదరాబాద్, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): గవర్నర్ కోటాలో ఖాళీ అయిన మూడు ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు ముమ్మరం చేసింది. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సామాజిక, రాజకీయ సమీకరణాలకు అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేయాలని భావిస్తోంది. రాష్ట్ర నాయకులతో పాటు ఢిల్లీలోని పార్టీ పెద్దలతోనూ సంప్రదింపులు జరుపుతోంది. త్వరలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు, ఖైరతాబాద్ ఉప ఎన్నికను కూడా పరిగణనలోకి తీసుకుని పార్టీకి రాజకీయంగా ప్రయోజనం కలిగించే నాయకులకు అవకాశం కల్పించాలనే ఆలోచనలో ఉంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కొనసాగిన గోరేటి వెంకన్న, బొగ్గారపు దయానంద్, బస్వరాజు సారయ్యల పదవీకాలం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వీరికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ప్రతిపక్ష నేత

మిగతా 2 లో



ఆధునిక యుద్ధంలో ఎవరూ సురక్షితం కాదు

- ఏఐ, డ్రోన్లతో మారుతున్న యుద్ధరంగ స్వరూపం
- రక్షణ దళాల అధిపతి (సీడీఎస్) జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి
- ఏఎన్ఐ నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్‌లో రక్షణ దళాల అధిపతి కీలక వ్యాఖ్యలు

4

గూఢచర్యంలో హనీట్రాప్ భాగమే..

- వాయుసేన చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ కీలక వ్యాఖ్యలు!





పించన్ల పంపిణీలో అరుదైన దృశ్యం

- ఒకే వేదికపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

4

- ఊరూ వాడా ఉత్సాహంగా 'చేయూత' నూతన పింఛన్ల పంపిణీ

శూన్య హస్తాలు.. శుష్కప్రియాలు

- ఇదీ రేవంత్ నిర్వాకం
- తప్పుచేసి మాపై నిందలా?
- మీరు చేసిన తప్పును సరిదిద్దాం
- మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరిట కమీషన్లు దండుకున్నదీ మీరే
- కృష్ణాజలాల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తి విఫలం
- కాంగ్రెస్ వైఫల్యంతో 25లక్షల ఎకరాల్లో ఎండిన పంట
- అకాల వర్షం నష్టాలకు ఇంతవరకు సాయం అందలేదు
- మాజీ మంత్రి హరీష్ రావు



3

కరీంనగర్ సీపీ వివాదం

- పాడి కౌశిక్ రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ
- మినీ మేడారం జాతరలో సీపీపై అనుచిత వ్యాఖ్యల కేసు

3



మినీ మేడారం జాతర సందర్భంగా జరిగిన వివాదానికి సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది.



గుండు వాణి అక్రమాస్తుల గుట్టురట్టు!

- టౌన్ ప్లానింగ్ అధికారి ఆస్తులపై ఏసీబీ దాడులు
- ఒకేసారి 28 ప్రాంతాల్లో విస్తృత సోదాలు
- హైదరాబాద్, మహబూబ్‌నగర్‌లో ఎనిమిది స్థలాల గుర్తింపు

2

- గతంలో రూ.75 వేల లంచం కేసులో అరెస్టు
- బంధువులు, స్నేహితుల ఇళ్లలోనూ తనిఖీలు

ఓట్ చోర్.. గద్దీ ఛోడ్



- భారత్ సమ్మిట్‌లో విదేశీ నేత వ్యాఖ్యలపై దుమారం!
- ఇటలీ నేత వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం సీరియస్
- జోక్యం వీసా నిబంధనల ఉల్లంఘనేనని వెల్లడి
- రాహుల్ గాంధీపై బీజేపీ, బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు

.. వివరాలు 4లో

ఎన్నికల సంఘానికి 48 ప్రశ్నలు

- సుప్రీంకోర్టుకు రాహుల్!
- ఓటర్ల జాబితా సవరణలో ఏకపక్ష నిర్ణయాలంటూ ఆరోపణలు

4



ప్రపంచానికి భారత్ సరికొత్త మార్గం చూపింది!

- భారత్‌పై బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియమ్ ప్రశంసలు
- స్వచ్ఛ ఇంధన రంగంలో భారత్ పురోగతి అద్భుతమని కితాబు

4



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం!

ఖాళీ రైలు బోగీల్లో ఒక్కసారిగా చెలరేగిన అగ్ని

5, 6 ప్లాట్‌ఫారాల మధ్య నిలిపిన కోచ్‌లకు మంటలు

రైల్వే సిబ్బంది అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం

ప్రాణనష్టం లేదని వెల్లడించిన అధికారులు

హైదరాబాద్, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): చర్లపల్లి రైల్వే స్టేషన్ ఆవరణలో సోమవారం ఒక్కసారిగా భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్ నంబర్ 5, 6 మధ్య నిలిపి ఉంచిన ఓ ఖాళీ రైలు బోగీల్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు పక్కనున్న ఇతర బోగీలకు కూడా వ్యాపించడంతో దట్టమైన పొగలు ఆకాశాన్ని కమ్మేశాయి. ఈ ఘటనతో స్టేషన్ ప్రాంగణంలోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బోగీల నుంచి మంటలు, పొగలు రావడాన్ని గమనించిన రైల్వే స్టేషన్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ప్రమాద తీవ్రత పెరగకముందే ప్లాట్‌ఫామ్‌పై ఉన్న ప్రయాణికులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మంటలు ఇతర రైళ్లకు, స్టేషన్ ఆస్తులకు వ్యాపించకుండా ఉండేందుకు తక్షణమే విద్యుత్ సరఫరాను నిలిపివేసి, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. రైల్వే పోలీసులు, స్థానిక ఉన్నతాధికారులు కూడా సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ప్రమాద సమయంలో రైలు కోచ్‌లు పూర్తిగా ఖాళీగా ఉండటంతో పెను ప్రమాదం తప్పిందని, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ప్రాణనష్టం సంభవించలేదని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

టీపీవో గుండు వాణి అక్రమాస్తుల గుట్టురట్టు!

ఒకేసారి 28 ప్రాంతాల్లో విస్తృత సోదాలు

హైదరాబాద్, మహబూబ్‌నగర్‌లో ఎనిమిది స్థలాల గుర్తింపు

హైదరాబాద్, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై మొయినాబాద్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిణి గుండు వాణిపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం నుంచి అత్తాపూర్‌లోని ఆమె నివాసంతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. మొత్తం 28 ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు ముమ్మర తనిఖీలు చేపట్టాయి. గత సెప్టెంబర్ 30న మొయినాబాద్ టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో జరిగిన లంచం వ్యవహారంలో గుండు వాణి ఏసీబీకి పట్టుబడ్డారు. ఓ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు ఆమె రూ.75 వేలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వాణి తరఫున సీనియర్ అసిస్టెంట్ యలమోని సుదర్శన్ ఆ నగదును స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి నుంచి రూ.75 వేల నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. లంచం కేసు తదుపరి విచారణలో భాగంగా వాణి అక్రమాస్తులపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. ప్రాథమిక దర్యాప్తులో హైదరాబాద్‌లో నాలుగు, మహబూబ్ నగర్‌లో మరో నాలుగు ప్రాంతాల్లో విలువైన స్థలాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఆస్తులకు సంబంధించి వారం రోజుల క్రితమే ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. వాణి నివాసంతోపాటు బంధువులు, స్నేహితుల ఇళ్లలో మొత్తం 28 ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయని, తనిఖీలు పూర్తయిన తర్వాత స్వాధీనం చేసుకున్న ఆస్తులు, నగదు, ఇతర పూర్తి వివరాలను వెల్లడిస్తామని అధికారులు పేర్కొన్నారు.

ఖేలో ఇండియాకు విస్తృత ప్రచారం కల్పించాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): రాష్ట్రంలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026 జాతీయ స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేసేందుకు పటిష్ఠమైన ఏర్పాట్లు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి కూడా అంతర్జాలం ద్వారా సమావేశంలో పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌తోపాటు హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న ఈ పోటీలకు సుమారు ఎనిమిది వేల మంది క్రీడాకారులు, ఇతర ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని సీఎస్ సూచించారు. ప్రధాన కూడళ్లు, బహిరంగ ప్రదేశాల్లో ప్రచార ఫలకాలు ఏర్పాటు చేయడంతోపాటు క్రీడల చిహ్నం, గుర్తులను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ముఖ్యంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, కాజీపేట రైల్వే స్టేషన్లు, ప్రధాన బస్టాండ్లలో ప్రత్యేక ప్రచార ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. క్రీడల ప్రాధాన్యాన్ని తెలియజేసేలా జ్యోతి ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. పోటీలు జరిగే వేదికల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు సిద్ధం చేయడంతోపాటు క్రీడాకారులకు నాణ్యమైన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో క్రీడా పోటీలను వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని సీఎస్ సూచించారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై కాంగ్రెస్ కసరత్తు

మొదటి పేజీ తరువాయి

మధుసూదనాచారి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఖాళీ అయిన ఈ స్థానాల్లో కొత్తవారి నియామకంపై ఇప్పుడు పార్టీలో విస్తృత చర్చ సాగుతోంది. అధికారంలోకి రావడానికి కృషి చేసిన పలువురు నాయకులు ఈసారి తమకు అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నారు.

బీసీలకు ప్రాధాన్యంపై సీఎం హామీ

ప్రభుత్వానికి మరో రెండేళ్ల పదవీకాలం మాత్రమే మిగిలి ఉండటంతో, వచ్చే ఎన్నికలకు ముందే సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. ముఖ్యంగా బీసీ ఓటర్లను ఆకర్షించేందుకు అన్ని రాజకీయ పార్టీలు వ్యూహాలు రచిస్తున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్ కూడా ఈ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడంపై దృష్టి పెట్టింది. ఇటీవల జరిగిన రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారికే అవకాశం కల్పించడంతో బీసీల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు ప్రాధాన్యం ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలోనే ప్రకటించారు. సిరిసిల్ల, రవీంద్రభారతి సభల్లో ఈ విషయాన్ని వెల్లడించారు. మూడు స్థానాల్లో రెండింటిని పద్మశాలి,



ముదిరాజ్, మున్నూరు కాపు సామాజిక వర్గాలకు కేటాయించే ఆలోచనను కూడా బయటపెట్టారు. పద్మశాలి సామాజిక వర్గం నుంచి దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తె పవిత్ర వాణి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ కుటుంబానికి ప్రాతినిధ్యం కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈరవత్రి అనిల్, పున్నా కైలాష్ పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన తర్వాత ఆ సామాజిక వర్గానికి ప్రాధాన్యం కల్పించే ప్రయత్నాల్లో భాగంగా గుండు సుధారాణికి వరంగల్ కాకతీయ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్ పదవి కట్టబెట్టిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి నీలం మధు పేరు పరిశీలనలో ముందున్నట్లు తెలుస్తోంది. మున్నూరు కాపు వర్గం నుంచి ముఖ్యమంత్రికి సన్నిహితుడిగా పేరున్న కరీంనగర్ లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేశంకు అవకాశం దక్కవచ్చని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వీరితో పాటు చరణ్ కౌశిక్ యాదవ్, లోకేశ్ యాదవ్, చనగాని దయాకర్, నేరెళ్ల శారద పేర్లు కూడా ఆశావహుల జాబితాలో ఉన్నాయి. మిగిలిన మూడో ఎమ్మెల్సీ స్థానాన్ని ఏ సామాజిక వర్గానికి కేటాయించాలనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. బీసీలకే మరో అవకాశం ఇస్తారా? లేక ఎస్సీ, ఓసీ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. ఓసీల్లో బ్రాహ్మణ సామాజిక వర్గానికి కేటాయిస్తే హర్కర వేణుగోపాల్‌రావు పేరు పరిశీలనకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎస్సీలకు అవకాశం కల్పిస్తే మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, దొమ్మాటి సాంబయ్య పేర్లు వినిపిస్తున్నాయి. సామాజిక సమతుల్యతతో పాటు రానున్న ఎన్నికల్లో పార్టీకి కలిగే ప్రయోజనాలను బేరీజు వేసిన తర్వాతే కాంగ్రెస్ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

విద్యుత్ సరఫరా వ్యవస్థ సమర్థ నిర్వహణ

- ఎల్‌నినో ప్రభావం ఉన్నా సరఫరాలో అంతరాయం ఉండొద్దు
- రబీలోనూ రైతులు, అన్ని వర్గాల వినియోగదారులకు నిరంతరాయంగా సరఫరా
- విద్యుత్తు ఉన్నతాధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. విద్యుత్ డిమాండ్ చరిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరుకున్నా వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేయడంలో విద్యుత్ సంస్థలు సమర్థంగా పనిచేస్తున్నాయని అభినందించారు. రానున్న రబీ సీజన్‌లోనూ ఇదే పనితీరును కొనసాగిస్తూ రైతులు, గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు నిరంతరాయంగా విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాభవన్‌లో ఇంధన శాఖ ఉన్నతాధికారులు, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులతో విద్యుత్ సరఫరా పరిస్థితిపై సోమవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, సరఫరా నిర్వహణ, మౌలిక సదుపాయాల విస్తరణ, రానున్న



రబీ సీజన్‌కు విద్యుత్ సంస్థల సన్నద్ధతపై చర్చించారు. అక్టోబర్ 16న రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 20,018 మెగావాట్లకు చేరుకుని చరిత్రాత్మక గరిష్ఠ స్థాయిని నమోదు చేసిందని గుర్తు చేశారు. వరుసగా రెండో రోజు కూడా 20,003 మెగావాట్ల స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ విద్యుత్ సంస్థలు సమర్థంగా సరఫరా చేశాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏటా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని, గత ఏడాది నవంబర్ 16న 8,522 మెగావాట్లుగా ఉన్న గరిష్ఠ డిమాండ్ ఈ ఏడాది అదే తేదీన 12,802 మెగావాట్లకు చేరిందని వివరించారు. ఇందులో టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 8,859 మెగావాట్లు, ఎన్పీడీసీఎల్ పరిధిలో 3,595 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదైందన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా జల విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 4,000 మెగావాట్ల కొరత ఏర్పడినప్పటికీ ఖరీఫ్ లో రైతులతోపాటు అన్ని వర్గాల వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ ఇబ్బందులు లేకుండా సరఫరా చేయడం అభినందనీయమన్నారు. ఇదేవిధంగా రబీ సీజన్‌లోనూ విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మరోవైపు పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సరఫరా, మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నట్లు అధికారులు వివరించారు. దావూద్‌ఖాన్‌గూడ, బడంగ్‌పేట ప్రాంతాల్లో కొత్తగా నిర్మించిన రెండు 33/11 కేవీ సబ్ స్టేషన్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. వీటి ద్వారా సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడంతోపాటు సరఫరా నాణ్యత, విశ్వసనీయత మెరుగుపడుతుందని వెల్లడించారు. రబీ సీజన్‌లో దీర్ఘకాలిక పొడి వాతావరణం ఉండే అవకాశాలున్నందున విద్యుత్ డిమాండ్‌లో ఆకస్మిక పెరుగుదల సంభవించే పరిస్థితులను ముందుగానే అంచనా వేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. డిమాండ్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన విద్యుత్‌ను సమకూర్చుకోవాలని, ఏ ఒక్క వర్గం వినియోగదారుడికీ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి.పాటిల్, డైరెక్టర్లు శివాజీ, చక్రపాణి, నరసింహ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అక్రమ అండాల సేకరణ కేసులో దర్యాప్తు ముమ్మరం

- చంచల్‌గూడ జైలుకు నిందితుల తరలింపు
- పరారీలో పలువురు ఐవీఎఫ్ కేంద్రాల నిర్వాహకులు
- ఏడు కేంద్రాల్లో నిబంధనల ఉల్లంఘనలపై అనుమానాలు
- నకిలీ ఆధార్‌లతో యువతుల నుంచి పదేపదే అండాల సేకరణ

హైదరాబాద్, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): నగరంలో కలకలం రేపిన అక్రమ అండాల సేకరణ వ్యవహారంలో పోలీసుల దర్యాప్తు వేగం పెంచారు. ఈ అక్రమ దందాతో సంబంధం ఉన్న పలువురు నిందితులను ఇప్పటికే అరెస్టు చేసిన పోలీసులు, కోర్టు అనుమతితో విచారించిన అనంతరం ఆదివారం మధ్యాహ్నం చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న కీలక వ్యక్తుల వివరాలు వెలుగులోకి రావడంతో పలువురు ఐవీఎఫ్ కేంద్రాల నిర్వాహకులను కూడా అరెస్టు చేసేందుకు సిద్ధమవుతున్నారు. పోలీసుల తనిఖీలు ముమ్మరం కావడంతో ఈ అక్రమ వ్యవహారంలో సంబంధం ఉన్న పలువురు ఐవీఎఫ్ కేంద్రాల నిర్వాహకులు అందుబాటులో లేకుండా పోయారు. వారి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. నగరంలోని ఏడు ఐవీఎఫ్ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగినట్లు ప్రాథమిక విచారణలో అనుమానాలు వ్యక్తమయ్యాయి. వైద్యఆరోగ్య శాఖ అధికారులతో కలిసి టాస్క్ ఫోర్స్ బృందాలు ఆయా కేంద్రాల రికార్డులను పరిశీలిస్తున్నాయి. దర్యాప్తులో అండాల సేకరణ వెనుక సాగిన అక్రమ వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. సంతానం లేని దంపతుల అవసరాలను



ఆసరాగా చేసుకున్న ఏజెంట్లు వివిధ రాష్ట్రాలకు చెందిన పేద యువతులను హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు పోలీసులు గుర్తించారు. అండాల దాతల రక్తవర్గం, మతం, కులం, చర్మం రంగు, ఎత్తు తదితర వివరాల ఆధారంగా సేకరణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. ఒక్కో యువతికి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లిస్తామని ఆశ చూపినట్లు సమాచారం. అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్టీ) చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తూ ఒకే యువతి నుంచి పలుమార్లు అండాలు సేకరించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఇందుకోసం నకిలీ ఆధార్ కార్డులను సైతం రూపొందించినట్లు గుర్తించారు. మరోవైపు సేకరించిన అండాల నాణ్యత ఆశించిన స్థాయిలో లేదనే కారణంతో, సంబంధిత ప్రక్రియలో భాగంగా గర్భం దాల్చిన మహిళలకు బలవంతంగా అబార్షన్లు చేయించారనే తీవ్ర ఆరోపణలు కూడా వెలుగులోకి వచ్చాయి. మహిళల ఆరోగ్యం, ప్రాణాలకు ముప్పు కలిగించేలా సాగిన ఈ అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే అరెస్టయిన నిందితుల విచారణతో పాటు పరారీలో ఉన్న ఐవీఎఫ్ కేంద్రాల నిర్వాహకుల కోసం గాలింపు కొనసాగుతోంది. వారి అరెస్టుతో ఈ అక్రమ అండాల సేకరణ వెనుక ఉన్న మరిన్ని వివరాలు బయటపడే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

కరీంనగర్ సీపీ వివాదం

హైదరాబాద్, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): మినీ మేడారం జాతర సందర్భంగా జరిగిన వివాదానికి సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా వాయిస్ శాంపిల్ ఇవ్వాలంటూ పోలీసులు జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో దర్యాప్తు కోసం కౌశిక్‌రెడ్డి తన వాయిస్ శాంపిల్‌ను పోలీసులకు అందించాల్సి ఉంటుంది. కరీంనగర్ జిల్లా వీణవంక పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు విచారణలో భాగంగా వాయిస్ శాంపిల్ ఇవ్వాలని పోలీసులు కౌశిక్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. అయితే తాను కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను దూషించలేదని, ఉద్దేశపూర్వకంగా చేసిన ఫిర్యాదు ఆధారంగానే కేసు నమోదు చేశారని ఆయన కోర్టును ఆశ్రయించారు. పోలీసుల నోటీసులను రద్దు చేయాలని కోరారు. ఈ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. ఈ ఏడాది జనవరి చివరిలో వీణవంకలో నిర్వహించిన మినీ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా ఈ వివాదం చోటుచేసుకుంది. జాతరకు పరిమిత సంఖ్యలో వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని పోలీసులు స్పష్టం చేయగా, కౌశిక్‌రెడ్డి భారీ కాన్వాయ్‌తో రావడంతో వివాదం మొదలైంది. తన కుటుంబ సభ్యులతో కలిసి రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారని పోలీసులు పేర్కొన్నారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదం జరిగిందని, కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై మతపరమైన వ్యాఖ్యలు చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. జాతర సందర్భంగా పోలీసుల సూచనల మేరకు నాలుగు వాహనాలకు అనుమతి ఇవ్వడంతో కౌశిక్‌రెడ్డి గద్దెల వద్దకు చేరుకున్నారు. అక్కడ దళిత మహిళా సర్పంచ్‌తో కొబ్బరికాయ కొట్టించాలని ఆయన పట్టుబట్టినట్లు సమాచారం. స్థానిక ట్రస్టీ వర్గాలతో విభేదాల నేపథ్యంలో శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని భావించిన పోలీసులు ఎమ్మెల్యేను, ఆయన కుటుంబ సభ్యులను అక్కడి నుంచి తరలించారు. ఈ పరిణామాల నేపథ్యంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 126(2), 132, 196, 299 తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మరోవైపు, జాతరలో మొక్కులు చెల్లించుకోకుండా ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని బీఆర్ఎస్ నేతలు గతంలో ఆరోపించారు. తాజా హైకోర్టు తీర్పుతో ఈ కేసు దర్యాప్తులో వాయిస్ శాంపిల్ సేకరణకు మార్గం సుగమమైంది.

శూన్య హస్తాలు.. శుష్కప్రియాలు

- ఇదీ రేవంత్ నిర్వాకం
- తప్పచేసి మాపై నిందలా?
- మీరు చేసిన తప్పను సరిదిద్దాం
- మొబిలైజేషన్ అడ్వాన్స్ల పేరిట కమీషన్లు దండుకున్నదీ మీరే
- కృష్ణాజలాల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తి విఫలం
- కాంగ్రెస్ వైఫల్యంతో 25లక్షల ఎకరాల్లో ఎండిన పంట
- అకాల వర్షం నష్టాలకు ఇంత వరకు సాయం అందలేదు
- మాజీ మంత్రి హరీష్ రావు



సిద్ధిపేట, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): నాడు ఏడేళ్లు, నేడు మూడేళ్లు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్లలో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదని, కొత్తగా ఒక్క ప్రాజెక్టు కట్టలేదని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. శూన్య హస్తాలు, శుష్క ప్రియాలు తప్ప రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు చేసింది గుండు సున్నా అని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. సిద్ధిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురద జల్లడం మాని, తాము నిర్మించిన ప్రాజెక్టుల చివరి దశ పనులను పూర్తి చేసి పూర్తి ఆయకట్టుకు నీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న సిద్ధిపేటకు వస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ఆయన పలు ప్రశ్నలు సంధిస్తూ బహిరంగ లేఖ విడుదల చేశారు. గతంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 2, 2024న సిద్ధిపేటకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. కొమురవెల్లి మల్లన్న సాక్షిగా పండ్రాగస్టు లోపు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చినా, ఇప్పటికీ అమలు కాలేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలోనూ, తన సిద్ధిపేట నియోజకవర్గంలోనూ వేలాది మందికి రుణమాఫీ కాలేదన్నారు. దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పనందుకే రాష్ట్రానికి అరిష్టం కలుగుతోందని, రేవంత్ పాపం వల్లనే రాష్ట్రానికి కరువు వచ్చిందని ఎద్దేవా చేశారు. రెండోసారి సిద్ధిపేటకు వచ్చినప్పుడు 45 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు ఇస్తామని హామీ ఇచ్చి 230 రోజులు గడిచినా ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుని, రైతు బంధు, రుణమాఫీ పూర్తి చేసిన తర్వాతే సిద్ధిపేటకు రావాలని, అప్పుడు తానే స్వయంగా బొకే ఇచ్చి స్వాగతం పలుకుతానని సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలో సిద్ధిపేటకు మంజూరైన వెటర్నరీ కాలేజీని కొడంగల్‌కు తరలించడమే కాకుండా, ఫిబ్రవరి 29, 2024న దాన్ని రద్దు చేశారని హరీశ్‌రావు మండిపడ్డారు. సిద్ధిపేట ప్రాంతానికి మంజూరైన ఔటర్ రింగ్ రోడ్డు, బీఎస్సీ అగ్రికల్చర్ కాలేజీ, శిల్పారామం, ఎస్సీ మహిళా రెసిడెన్షియల్, స్పోర్ట్స్ స్టేడియం, ఆడిటోరియం వంటి వివిధ పనులకు సంబంధించిన రూ. 1070 కోట్ల నిధులను నిలిపివేసి, పనులను రద్దు చేశారని ఆరోపించారు. యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్ల విషయంలోనూ సిద్ధిపేట పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ వివక్ష చూపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వైఫల్యం కారణంగా వానాకాలంలో రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయిందని, అకాల వర్షాలు, వడగళ్ల వాన వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాల్లో అతి తక్కువ నీటిని ఎత్తిపోశారని, కృష్ణా జలాల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమై చేతగానితనాన్ని దాచుకునేందుకు తమపై బురద చల్లుతోందని ధ్వజమెత్తారు. మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ కింద కాలువల తవ్వకం నిలిపివేయడంతో హుస్నాబాద్, చేర్యాల ప్రాంతాలకు తీవ్ర అన్యా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల చదువులు ఆగిపోతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా నిలిపివేసిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, సిద్ధిపేట ప్రజల ఆత్మగౌరవంతో చెలగాటం ఆడటం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

మాతా శిశు ఆసుపత్రిలో టీఎన్జీవోల సభ్యత్వ నమోదు

ఉద్యమ కెరటం, కరీంనగర్: కరీంనగర్‌లోని మాతా శిశు ఆసుపత్రిలో సోమవారం భోజన విరామ సమయంలో టీఎన్జీవోల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు, ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నర్సింగ్ ఆఫీసర్లు, నర్సింగ్ సూపరింటెండెంట్లకు సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎన్జీవోల సంఘంలో సభ్యత్వం అంటే కేవలం పైసల సేకరణ కాదని, గుణగణాలున్న ఉద్యోగులను, నిబద్ధత కలిగిన నాయకులను, హక్కుల కోసం పోరాడే పోరాటయోధులను సమీకరించడమని అన్నారు. ఎనిమిది దశాబ్దాల ఘన చరిత్ర కలిగిన టీఎన్జీవోల సంఘం ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. నర్సింగ్ ఉద్యోగులు సాధారణ ఉద్యోగులు కాదని, ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలిచే సేవా సైనికులని కొనియాడారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ, విషజ్వరాలు ప్రబలిన సమయంలోనూ తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు వైద్య సేవలందించిన మహోన్నత సేవకులని అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడే నర్సింగ్ ఉద్యోగులకు ఏ ఆపద వచ్చినా కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత టీఎన్జీవోల సంఘానిదని భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో ఎవరైనా ఆటంకాలు కలిగించినా, ప్రభుత్వపరంగా వారికి రావాల్సిన హక్కులకు భంగం కలిగినా జిల్లా, రాష్ట్ర సంఘం అండగా నిలబడి న్యాయం జరిగే వరకు పోరాడుతుందని స్పష్టం చేశారు. టీఎన్జీవోల సంఘం క్రమశిక్షణకు, ఐక్యతకు మారుపేరని, ప్రభుత్వ ఆదేశాలను, ఉన్నతాధికారుల సూచనలను గౌరవిస్తూ అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. సంఘం పేరును ఉపయోగించి ఎవరూ అవాంఛనీయ కార్యకలాపాలకు పాల్పడరాదని, సంఘం గౌరవ ప్రతిష్ఠలను కాపాడటం ప్రతి సభ్యుడి బాధ్యతని పేర్కొన్నారు. ఉద్యోగుల ఐక్యతే సంఘానికి బలమని, ఉద్యోగుల సంక్షేమమే సంఘం లక్ష్యమని, ఉద్యోగులకు అన్యాయం జరిగితే పోరాటమే తమ మార్గమని దారం శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ గౌడ్, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, తిమ్మాపూర్ అధ్యక్షులు పోలు కిషన్, నాయకులు కమలాకర్, లవకుమార్, కరుణాకర్, నారాయణ, గుండ రాజేష్, బండ అన్వేష్, ప్రకాశం, రాహేల్, రాజేష్, దిలీప్, ఉదయ్, సరోజ, రాధిక, షెర్లీ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



నా భూమిని లాక్కున్నారు.. న్యాయం చేయండి!

- అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు
- రెవెన్యూ అధికారుల సహకారంతోనే భూమి కబ్జా చేశారని ఆవేదన

ఉద్యమ కెరటం, మానకొండూర్: తనకు చెందిన 15 గుంటల భూమిని అక్రమంగా లాక్కున్నారని, ఫోర్జరీ పత్రాలతో చేయించిన రిజిస్ట్రేషన్లను రద్దు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామానికి చెందిన మద్ది మాధవి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మానకొండూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. చనిపోయిన వ్యక్తుల సంతకాలను ఫోర్జరీ చేసి, రెవెన్యూ అధికారుల సహకారంతో తన భూమిని ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆమె ఆరోపించారు. క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండానే పట్టా మార్పిడి చేయడం వెనుక అధికారుల పాత్ర ఉందని, సమగ్ర దర్యాప్తు జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు. చెంజర్ల గ్రామ శివారులోని సర్వే నంబరు 568/అ/2లో ఉన్న 2 ఎకరాల 3 గుంటల భూమిని తన మామ మద్ది మల్లయ్య గతంలో బోల్ల పరమేశ్వరయ్య నుంచి సాదాబైనామా ద్వారా కొనుగోలు చేశారని మాధవి తెలిపారు. అయితే పట్టా మార్పిడి జరగకపోవడంతో భూమి రికార్డుల్లో పరమేశ్వరయ్య పేరే కొనసాగుతోందన్నారు. తన మామకు ఐదుగురు కుమారులు కాగా, తన భర్త దివంగత మద్ది రాజు వాటాగా వచ్చిన 15 గుంటల భూమి ఆయన మరణానంతరం తనకు సంక్రమించిందని వివరించారు. ఆ భూమిలోనే తన భర్త సమాధి ఉందని, సుమారు 30 ఏళ్లుగా భూమి తమ ఆధీనంలోనే ఉందని పేర్కొన్నారు. పరమేశ్వరయ్య వారసులకు రూ. 1.60 లక్షలు చెల్లించి నోటరీ పత్రం కూడా పొందినట్లు తెలిపారు. అయితే తన పేరుమీద పట్టా లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని మరిది మద్ది లక్ష్మయ్య భూమిని లాక్కునేందుకు ప్రయత్నించారని మాధవి ఆరోపించారు. పరమేశ్వరయ్య మరణించి దాదాపు 17 ఏళ్లు గడిచినా ఆయనతోపాటు తన మామ మల్లయ్య సంతకాలను ఫోర్జరీ చేసి ఆర్వోఆర్ ద్వారా పట్టా మార్పిడి చేయించుకున్నారని పేర్కొన్నారు. అనంతరం అక్టోబర్ 17న మద్ది రవి, మద్ది మధు, మద్ది కుమార్ పేర్లపై భూమిని రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. గతంలో మద్ది కుమార్ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో జనవరి 14న మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైందని తెలిపారు. తన భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించి అక్రమంగా జరిగిన పట్టా మార్పిడి, రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని మాధవి కోరారు. ఫోర్జరీ పత్రాలు సృష్టించిన వ్యక్తులతోపాటు క్షేత్రస్థాయి విచారణ చేయకుండా సహకరించిన రెవెన్యూ అధికారులపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తన ఆధీనంలో ఉన్న భూమిని ఇతరులు ఆక్రమించకుండా రక్షణ కల్పించి న్యాయం చేయాలని తహసీల్దార్‌ను వేడుకున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తులు, అధికారుల వివరణ తెలియాల్సి ఉంది.





2014కు ముందు ఇండ్ల పథకం లబ్ధిదారులకు ఊరట

పట్టా/పొజిషన్ సర్టిఫికెట్ల వాపస్‌కు ఆదేశాలు

7లక్షల మందికి ప్రయోజనం

దశాబ్దకాలపు నిరీక్షణకు తెరదించిన ప్రజా ప్రభుత్వం

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): దశాబ్దాలుగా పేదలు కన్న సొంతింటి కలను సాకారం చేస్తూ, వారి ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తున్న ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇందిరమ్మ సహా వివిధ ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద ఇళ్లు నిర్మించుకున్న పేదలకు గతంలో జారీ చేసిన పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లను తిరిగి అందించాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు పేదల సొంతింటిపై హక్కును మరింత భద్రం చేస్తూ, వారి కుటుంబాలకు భరోసా కల్పించే దిశగా తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఏడు లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. దశాబ్దానికి పైగా లబ్ధిదారులకు సంబంధించిన ఇంటి పట్టా సర్టిఫికెట్లు తిరిగి రాకపోవడంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తనకు పలు విజ్ఞాపనలు వచ్చాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో 22-ఎ భూములపై సమీక్షలు జరుగుతున్న సమయంలో ఈ పట్టాలు తహసీల్దార్ కార్యాలయాల్లో భారీగా పేరుకుపోయి ఉన్నాయని ముఖ్యమంత్రి దృష్టికి రాగా, వెంటనే వాటిని పేదలకు వాపస్ చేయాలని ఆదేశించారని వెల్లడించారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా, ప్రభుత్వం వద్ద ఉన్న లబ్ధిదారుల ఇండ్ల పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లను తక్షణమే వెనక్కి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్లు మంత్రి స్పష్టం చేశారు. దశాబ్ద కాలపు సమస్యకు శాశ్వత పరిష్కారం:2014 కంటే ముందు అమలు చేసిన గృహ నిర్మాణ పథకాల్లో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ సబ్సిడీ, లబ్ధిదారుల వాటాతో పాటు బ్యాంకు రుణం ద్వారా ఆర్థిక సహాయం అందించేవారని పొంగులేటి గుర్తుచేశారు. ఈ రుణాల కోసం లబ్ధిదారుల ఇండ్లకు చెందిన పట్టాలను ష్యూరిటీగా ఉంచుకునేవారని, రుణ వాయిదాలన్నింటినీ సక్రమంగా చెల్లించిన వారికి పట్టాలను తిరిగి ఇచ్చేవారని వివరించారు. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం ఇందిరమ్మ పథకాన్ని నిలిపివేయడంతో వివిధ కారణాలతో లక్షలాది మంది లబ్ధిదారులకు వారి ఇండ్లకు సంబంధించిన పత్రాలను తిరిగి ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న పట్టాలన్నింటినీ లబ్ధిదారులకు వాపస్ చేయాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

రహదారి భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి



ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్: రహదారి నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సెయింట్ జోయెల్స్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'రోడ్ సేఫ్టీ'పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంవీఐ సంజయ్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి కానీ, సెల్‌ఫోన్ మాట్లాడుతూ కానీ వాహనాలు నడపకూడదని సూచించారు. ముఖ్యంగా మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు జ్యోతి, అహఫాజ్ , విలియం, విల్సన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



ఆధునిక యుద్ధంలో ఎవరూ సురక్షితం కాదు

ఏఐ, డ్రోన్లతో మారుతున్న యుద్ధరంగ స్వరూపం

రక్షణ దళాల అధిపతి (సీడీఎస్) జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి

ఏఎన్ఐ నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్‌లో రక్షణ దళాల అధిపతి కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): కాలంతో పాటు యుద్ధరంగ స్వరూపం పూర్తిగా మారిపోతోందని, ఆధునిక సాంకేతిక సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు సైన్యం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ తనను తాను మెరుగుపరుచుకుంటూ ఉండాలని రక్షణ దళాల అధిపతి (సీడీఎస్) జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఉపగ్రహ ఆధారిత నిఘా, డ్రోన్‌లు ఆధునిక యుద్ధ తంత్రాన్ని పూర్తిగా మార్చేస్తున్నాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా నానాటికీ విస్తరిస్తున్న ఆధునిక యుద్ధ భూమిలో ఎవరూ సురక్షితంగా ఉండే అవకాశం లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. దిల్లీలో జరిగిన 'ఏఎన్ఐ నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 3.0'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీడీఎస్ రాజా సుబ్రమణి మాట్లాడుతూ.. ప్రస్తుతం యుద్ధ క్షేత్రం క్రమంగా విస్తరిస్తోందని తెలిపారు. గతంలో శత్రు దేశాలను ఓడించాలంటే కేవలం సైనికులను మాత్రమే లక్ష్యంగా చేసుకునేవారని, కానీ నేడు దేశాన్ని అన్ని రకాలుగా బలహీనపరిచేందుకు పరిశ్రమలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, విద్యుత్ కేంద్రాలు, చివరికి పౌర నివాస ప్రాంతాలపైనా దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శత్రువుల నుంచి ఇలాంటి బహుముఖ దాడులను ఎదుర్కోవాలంటే అత్యంత బలమైన రక్షణ వ్యవస్థలు కావాలని స్పష్టం చేశారు. ఆధునిక యుద్ధాల్లో ఖర్చుల నియంత్రణ ఎంతో కీలకమని జనరల్ రాజా సుబ్రమణి పేర్కొన్నారు. చాలా తక్కువ ధరతో తయారు చేసిన డ్రోన్లను కూల్చివేయడానికి మిలియన్ డాలర్ల విలువైన అత్యాధునిక క్షిపణులను ఉపయోగిస్తే.. ఆ దేశ యుద్ధ ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలహీనపడిపోతుందని హెచ్చరించారు. ఇందుకు ఉదాహరణగా.. ఇటీవల అమెరికా తన పేట్రియాట్ క్షిపణులను వేగంగా ఖాళీ చేయడాన్ని మనం చూశామని, వాటిని తిరిగి సమకూర్చుకోవడానికి అగ్రరాజ్యానికి అనేక ఏళ్లు పడుతుందని గుర్తుచేశారు. కాబట్టి అధునాతన ఆయుధాలతో పాటు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయ ఆయుధాలను, రక్షణ పరికరాలను స్వయంగా తయారు చేసుకోవడంపై దేశాలు దృష్టి పెట్టాలని సూచించారు. తమ ఆర్థిక, సైనిక బలాన్ని పటిష్టం చేసుకోవాలనుకునే దేశాలకు కృత్రిమ మేధ (ఏఐ), డేటా, కీలక ఖనిజాలపై నియంత్రణ చాలా అవసరమని సీడీఎస్ స్పష్టం చేశారు. వీటిపై పట్టు సాధించేందుకు ప్రపంచ దేశాల మధ్య పోటీ రోజురోజుకూ పెరుగుతోందని చెప్పారు. ప్రస్తుతం సాంకేతిక రంగంలో అగ్రగామిగా ఉన్న అమెరికా, చైనాల మధ్య ఈ ఆధిపత్య పోరు మరింత స్పష్టంగా కనిపిస్తోందని, అదే సమయంలో ఇతర దేశాలు కూడా ఆ అంతరాన్ని వేగంగా తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. సుదీర్ఘకాలం కొనసాగే ఎలాంటి సంఘర్షణలనైనా ఎదుర్కొనేందుకు దేశాలు తమ స్వదేశీ తయారీ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు.

గూఢచర్యంలో హనీట్రాప్ భాగమే..

వాయుసేన చీఫ్ మార్షల్ అశుతోశ్ దీక్షిత్ కీలక వ్యాఖ్యలు!

సాంకేతికంగా లొంగదీసుకోలేకే శత్రు దేశాలు సోషల్ మీడియా వేదికగా 'వలపు వలలు' విసురుతున్నాయని వెల్లడి



న్యూఢిల్లీ, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): భారత మిలటరీ వ్యవస్థ, దాని పరిశోధన విభాగాలు విదేశీ సైబర్ దాడులకు లొంగనంత అత్యంత సురక్షితంగా ఉన్నాయని, అందుకే విదేశీ ఇంటెలిజెన్స్ సంస్థలు సాంకేతికంగా దెబ్బతీయలేక 'హనీట్రాప్' (వలపు వల) మార్గాన్ని ఎంచుకున్నాయని భారత వాయుసేన చీఫ్ మార్షల్ అశుతోశ్ దీక్షిత్ పేర్కొన్నారు. రక్షణ రంగంలో హనీట్రాప్ ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా అశుతోశ్ దీక్షిత్ మాట్లాడుతూ.. "మిలటరీ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ అనేది పబ్లిక్ నెట్‌వర్క్ నుంచి పూర్తిగా వేరుగా ఉంటుంది. దానిపై ఎలాంటి సైబర్ దాడికి పాల్పడడం అసాధ్యం. అందుకే విదేశీ ఇంటెలిజెన్స్.. సాంకేతికంగా వ్యవస్థను దెబ్బతీయలేక, మనుషులను టార్గెట్ చేసుకునే మార్గాన్ని ఎంచుకుంది. పబ్లిక్ సెక్టార్ లాబొరేటరీ సిబ్బంది, ప్రైవేట్ సెక్టార్‌లోని డిఫెన్స్ కాంట్రాక్టర్లను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా వేదికగా ప్రేమ పేరుతో ట్రాప్ చేస్తున్నారు" అని తెలిపారు. వలపు వలలు అనేవి ఇంటెలిజెన్స్ గూఢచర్యంలో కేవలం ఒక చిన్న భాగం మాత్రమేనని, లోన్స్ పేరుతో, మార్కెట్ ఆశల పేరుతో ఇలా అనేక మార్గాల్లో ఈ కార్యకలాపాలు సాగుతున్నాయని ఆయన వివరించారు. మిలటరీ నెట్‌వర్క్‌లపై సైబర్ దాడులు సాధ్యం కానప్పటికీ, వ్యవస్థ లోపలి వ్యక్తుల ద్వారా ప్రమాదం పొంచి ఉంటుందని, అందుకే ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేటప్పుడే ఇలాంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. గత కొంతకాలంగా రక్షణ రంగాన్ని లక్ష్యంగా చేసుకుని ఇలాంటి హనీట్రాప్ దాడులు ఎక్కువవుతున్నాయి. సున్నితమైన సమాచారాన్ని దొంగిలించడానికి తన సహోద్యోగి మొబైల్‌లో మాల్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేశారన్న ఆరోపణలపై ఇటీవల ఢిల్లీలో ఓ డిఫెన్స్ అధికారి అరెస్టయ్యారు. వ్యక్తిగత జీవితంలో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ఆయనకు.. పాకిస్థానీ గూఢచారిగా భావిస్తున్న ఓ మహిళతో సోషల్ మీడియా ద్వారా సాన్నిహిత్యం ఉన్నట్లు విచారణలో తేలింది. అచ్చం ఇలాంటి ఘటనే ఆంధ్రప్రదేశ్‌లోనూ వెలుగు చూసింది. సోషల్ మీడియా ద్వారా పాకిస్థానీ మహిళతో స్నేహం చేస్తూ రహస్యాలు చేరవేస్తున్న ఇండియన్ నేవీ అధికారి ప్రదీప్ ముఖర్జీని పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు, అంతర్జాతీయ స్థాయిలోనూ టెక్ దిగ్గజాలపై ఇలాంటి నిఘా నీడలు కమ్ముకుంటున్నాయి. ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా (చీజఅఎఱఱ) సీఈవో.. చైనా గూఢచారితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారనే ఆరోపణలు సైతం సంచలనం సృష్టించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రక్షణ శాఖ మరింత అప్రమత్తమై కట్టుదిట్టమైన నిఘా చర్యలు చేపడుతోంది.

ఎన్నికల సంఘానికి 48 ప్రశ్నలు

- సుప్రీంకోర్టుకు రాహుల్!
- ఓటర్ల జాబితా సవరణలో ఏకపక్ష నిర్ణయాలంటూ ఆరోపణలు
- భారీగా ఓట్ల తొలగింపుపై సమాధానాలు కోరిన విపక్షాలు
- ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ప్రమాణపత్రాలకు డిమాండ్
- అధికారిక రికార్డులు బయట పెట్టాలంటూ న్యాయస్థానానికి విజ్ఞప్తి
- ఏకగ్రీవ నిర్ణయంతోనే ఉత్తర్వులు ఇచ్చామంటున్న ఎన్నికల సంఘం



న్యూఢిల్లీ, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై వివాదం మరోసారి సుప్రీంకోర్టుకు చేరింది. ఈ ప్రక్రియలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని, భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించారని ఆరోపిస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటు ఇతర విపక్ష నేతలు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. కేంద్ర ఎన్నికల సంఘానికి పది విభాగాల్లో మొత్తం 48 రాతపూర్వక ప్రశ్నలు సంధించేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌తోపాటు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ప్రమేయం లేకుండానే కీలక నిర్ణయాలు తీసుకున్నారా అన్న అంశంపై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సంఘం ముగ్గురు సభ్యుల ఉమ్మడి నిర్ణయంతోనే సవరణ ఉత్తర్వులు జారీ చేసిందా, లేక ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారా అన్నది తేలాల్సి ఉందని పిటిషనర్లు పేర్కొన్నారు. దీనిపై ముగ్గురు కమిషనర్లు స్వయంగా ప్రమాణపత్రాలు సమర్పించాలని కోరారు. అయితే అక్టోబర్ 26, నవంబర్ 14 తేదీల్లో డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ ఏటూరు ద్వారా దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్లలో ముగ్గురు సభ్యుల ఏకగ్రీవ నిర్ణయం మేరకే ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎన్నికల సంఘం పేర్కొందని పిటిషనర్లు వివరించారు. ఆ వాదనకు సంబంధించిన సమావేశాల వివరాలు, ఫైల్ నంబర్లు, అధికారిక రికార్డులను వెల్లడించలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సమాచార వ్యవస్థలో మార్పులు చేసేందుకు ప్రైవేటు సంస్థలకు అనుమతి ఉందా, ఎన్నికల నమోదు అధికారుల ఉత్తర్వులు లేకుండానే సామూహికంగా ఓట్ల తొలగింపు జరిగిందా, సమాచార భద్రతపై తనిఖీలు నిర్వహించారా అనే అంశాలపై సమాధానాలు కోరారు. కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తులో మార్పులకు ఎవరు ఆమోదం తెలిపారు, రాష్ట్రాల వారీగా ఎంతమంది ఓటర్ల పేర్లు తొలగించారు, వాట్సాప్, వ్యక్తిగత ఈమెయిళ్ల ద్వారా అధికారిక ఆమోదాలు పొందారా అనే ప్రశ్నలనూ లేవనెత్తారు. గతంలో సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన సమాధానాలను కూడా పిటిషనర్లు ప్రస్తావించారు. వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన పుట్టస్వామి కేసు తీర్పును ఉదహరిస్తూ కీలక సమాచారం ఎన్నికల సంఘం వద్దే ఉన్నప్పుడు సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన సమాధానాలు కోరే అధికారం న్యాయస్థానానికి ఉందని పిటిషనర్లు వాదించారు. ఏదైనా అధికారిక రికార్డును గోప్యంగా ఉంచాలనుకుంటే అందుకు నిర్దిష్ట కారణాలను కోర్టుకు వివరించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తదుపరి నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రపంచానికి భారత్ సరికొత్త మార్గం చూపింది!

భారత్‌పై బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియమ్ ప్రశంసలు

స్వచ్ఛ ఇంధన రంగంలో భారత్ పురోగతి అద్భుతమని కితాబు





ముంబై, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): పర్యావరణహిత ఇంధనాలను ప్రోత్సహించడంలో భారత్ సాధిస్తున్న అద్భుత పురోగతిని బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియమ్ కొనియాడారు. ప్రతిష్ఠాత్మక 'ఎర్త్‌షాట్ ప్రైజ్' ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన ఆయన, సోమవారం ముంబైలో నిర్వహించిన 'ఎర్త్‌షాట్ ప్రైజ్ ఇంపాక్ట్ అసెంబ్లీ'లో ప్రసంగిస్తూ భారత్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 50 శాతం శిలాజేతర ఇంధనాల ద్వారా సమకూర్చుకోవాలన్న లక్ష్యాన్ని భారత్ నిర్దేశిత గడువుకు ఐదేళ్ల ముందే చేరుకోవడం ఎంతో అభినందనీయమని ఆయన అన్నారు. భారత్‌లో సౌర ఇంధన వినియోగం వేగంగా పెరుగుతోందని, దశాబ్ద కాలంలోనే సౌరవిద్యుత్ సామర్థ్యం 50 రెట్లు వృద్ధి చెందడం విశేషమని మెచ్చుకున్నారు. వాతావరణ మార్పుల సంబంధిత సమస్యలకు పరిష్కారాలు చూపడంలో అంతర్జాతీయంగా భారత్ పాత్ర నానాటికీ పెరుగుతోందని ప్రిన్స్ విలియమ్ పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల ముందు ఆర్థికాభివృద్ధి లేదా పర్యావరణ పరిరక్షణ అనే వేర్వేరు ప్రత్యామ్నాయాలు మాత్రమే ఉన్నాయనే తప్పుడు భావన ప్రపంచవ్యాప్తంగా ఉందని వ్యాఖ్యానించారు. అయితే, ఆ రెండింటినీ కలిపి సమన్వయంతో అభివృద్ధి పథాన నడవొచ్చని భారత్ నిరూపించిందని ఆయన స్పష్టం చేశారు. "రంగులమయమైన, సంక్లిష్టమైన, పలు ప్రత్యామ్నాయాలతో కూడిన ఓ కొత్త చిత్రాన్ని భారత్ ప్రపంచానికి చూపించింది. ఇది కేవలం ఇంధనానికి సంబంధించిన మార్పు మాత్రమే కాదు, ప్రజలు మెరుగైన జీవన విధానాన్ని పొందే ప్రక్రియ" అని ప్రిన్స్ విలియమ్ అభివర్ణించారు. పర్యావరణ సమస్యలకు వినూత్న పరిష్కారాలు చూపే ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రిన్స్ విలియమ్ 2020లో 'ఎర్త్‌షాట్ ప్రైజ్'ను ఏర్పాటు చేశారు. ఆరో విడత ఎర్త్‌షాట్ ప్రైజ్ ప్రదానోత్సవ కార్యక్రమం నేడు (మంగళవారం, నవంబర్ 17) ముంబైలో అట్టహాసంగా జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 15 మంది ఫైనలిస్టులలో ఐదుగురు విజేతలను ప్రకటించి, ఒక్కొక్కరికి 1 మిలియన్ పౌండ్ల చొప్పున నగదు బహుమతి అందించనున్నారు.

కుల్గాంలో భారీ ఎన్‌కౌంటర్

ఎల్ఈటీ కమాండర్ లతీఫ్ భట్ మృతి ■ మరో ఉగ్రవాది కూడా హతం

కుల్గాం, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు చేపట్టిన భారీ ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో లష్కరే తోయిబా (ఎల్ఈటీ) కమాండర్ మహ్మద్ లతీఫ్ భట్ హతమయ్యాడు. దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లా లారూ ప్రాంతంలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో ఉగ్రవాది కూడా మరణించాడు. అతడిని ఉమర్‌గా ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. ఉగ్రవాదులు తలదాచుకున్నారన్న నిఘా సమాచారంతో భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. నవంబర్ 11న కుల్గాం జిల్లాలోని మీర్ బజార్ సమీపంలో సీఆర్‌పీఎఫ్ పోస్టుపై జరిగిన దాడికి లతీఫ్ భట్ సూత్రధారిగా వ్యవహరించినట్లు భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయి. ఆ దాడిలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు గాయపడ్డారు. దాడి అనంతరం ఉగ్రవాదులు సమీపంలోని అటవీ ప్రాంతంలోకి పారిపోవడంతో భద్రతా దళాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఐదు రోజుల పాటు అనుమానిత ప్రాంతాలను జల్లెడపట్టి చివరకు లారూ వద్ద ఉగ్రవాదుల ఆచూకీ గుర్తించాయి. లతీఫ్ భట్‌కు దక్షిణ కశ్మీర్‌లో జరిగిన పలు ఉగ్ర దాడులతో సంబంధం ఉన్నట్లు భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయి. తాజా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు జమ్మూకశ్మీర్ డీజీపీ నళిన్ ప్రభాత్ ధ్రువీకరించినట్లు వార్తలు వెల్లడించాయి. మరో ఉగ్రవాది పూర్తి వివరాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ఎన్‌కౌంటర్ అనంతరం పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.



ఓట్ చోర్.. గద్దీ చోడ్

భారత్ సమ్మిట్‌లో విదేశీ నేత వ్యాఖ్యలపై దుమారం!

ఇటలీ నేత వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం సీరియస్

జోక్యం వీసా నిబంధనల ఉల్లంఘనేనని వెల్లడి

రాహుల్ గాంధీపై బీజేపీ, బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు



హైదరాబాద్, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): హైదరాబాద్ వేదికగా జరిగిన 'భారత్ సమ్మిట్' సమావేశంలో ఇటలీకి చెందిన రాజకీయ నాయకుడు జాకోమో ఫిలిబెక్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గతంలో కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు ఉపయోగించిన 'ఓట్ చోర్, గద్దీ చోడ్' (ఓట్లను దొంగిలించిన వారు గద్దె దిగాలి) అనే నినాదాన్ని యూరోపియన్ సోషలిస్ట్ పార్టీ సెక్రటరీ జనరల్ అయిన ఫిలిబెక్ ఈ సమ్మిట్‌లో ప్రస్తావించడం వివాదానికి దారితీసింది. భారత్‌లో ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, 'ఒక వ్యక్తి, ఒక ఓటు' సిద్ధాంతాన్ని కాపాడటానికి రాహుల్ గాంధీ పోరాడుతున్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఈ సమ్మిట్‌లో ఒక విదేశీ పౌరుడు భారత అంతర్గత రాజకీయాలపై వ్యాఖ్యానించడంపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు తీవ్రంగా స్పందించాయి. విదేశీయులు ఎవరైనా భారతదేశానికి కేవలం కాన్ఫరెన్స్ లేదా సెమినార్లలో పాల్గొనేందుకే 'కాన్ఫరెన్స్ వీసా'పై వస్తారని, అలా వచ్చి దేశ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం, విమర్శలు చేయడం వీసా నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ స్వయంగా పాల్గొనడమే కాకుండా, విదేశీ నేత ఆ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో ఆనందంగా నవ్వుతూ చప్పట్లు కొట్టడం పట్ల బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. విదేశీ నాయకులను ఆహ్వానించి, దేశ అంతర్గత రాజకీయాలపై, ఎన్నికల వ్యవస్థపై విమర్శలు చేయించడంపై విపక్షాలు అధికార కాంగ్రెస్ పార్టీ తీరును తీవ్రంగా తప్పుపడుతున్నాయి.

వైభవంగా వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



ఉద్యమ కెరటం, మల్కాజిగిరి: జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో కొలువుదీరిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో బాలాజీ నగర్‌లోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ వార్షికోత్సవం ఒక వర్గానికి మాత్రమే పరిమితం కాకుండా అందరూ కలిసి జరుపుకోవాల్సిన ఆధ్యాత్మిక వేడుక అని అన్నారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మారగొని వెంకటేష్ గౌడ్, చిరంజీ రవీందర్ గుప్తా, ఉడుత సంతోష్ గుప్తా, హరీష్ గుప్తా, బల్లి చంద్రమౌళి, సంతోష్ గుప్తా, ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మెరుగైన పాలన కోసం
శాశ్వత భవనాలు

- **నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి**



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన పాలన, సౌకర్యాలు అందించేందుకే ప్రభుత్వం శాశ్వత భవనాలను నిర్మిస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డిలు అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం మామిడిగూడ గ్రామపంచాయతీ పరిధిలో రూ.20లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన గ్రామ పంచాయతీ భవనం అందుబాటులోకి రావడం ద్వారా గ్రామ అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మామిడిగూడ సర్పంచ్ మాడావి రాంబాయి, ఉప సర్పంచ్ చరణ్, మాజీ జెడ్పీటీసీ మాడావి రాజు, పటేల్ మార్సుకుల గోవింద్ రావ్, జంగు, హన్మంతు, సారంగ్ రావ్, వార్డు సభ్యులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల సమస్యల పరిష్కారమే లక్ష్యం
మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్



ఉద్యమ కెరటం, జవహర్‌నగర్: జవహర్‌నగర్ డివిజన్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మాజీ మేయర్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షురాలు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ అన్నారు. సోమవారం డివిజన్‌లోని పలు కాలనీల్లో పర్యటించి స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను స్వయంగా పరిశీలించి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం శాంతి మాట్లాడుతూ.. ప్రతి కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి జవహర్‌నగర్ డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు.

జగద్గురువుల ఆశీస్సులు పొందిన ఎమ్మెల్సీ దండే విఠల్



ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్‌పీఎం గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన సమస్య మార్గదర్శన, దర్శన కార్యక్రమానికి జగద్గురు శ్రీనాథ్ రామానందాచార్య నరేంద్రాచార్యజీ మహారాజ్ హాజరయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ జగద్గురువును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం భక్తిశ్రద్ధలతో జగద్గురువుల ఆశీస్సులు పొందారు. జగద్గురువుల దివ్య ఆశీస్సులు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్సీ దండే విఠల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సహాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో 'సన్‌రైజ్ అకాడమీ' విద్యార్థుల ప్రతిభ

- **దేశ్‌ముఖ్ రుద్ర, త్రిశూల్ నాయక్‌కు అండర్-19 పోటీల్లో అవకాశం**
- **గ్రామీణ, గిరిజన ప్రాంతాల యువ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో 'సన్‌రైజ్ క్రికెట్ అకాడమీ' విశేష కృషి**



ఉద్యమ కెరటం, ఇచ్చోడ: గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి రాష్ట్రస్థాయికి పరిచయం చేయడమే లక్ష్యంగా ఇచ్చోడలోని 'సన్‌రైజ్ క్రికెట్ అకాడమీ' చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోంది. అకాడమీలో శిక్షణ పొందుతున్న సాయి సమర్థ కళాశాల విద్యార్థులు దేశ్‌ముఖ్ రుద్ర, త్రిశూల్ నాయక్ ఇటీవల మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రికెట్ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతున్న ఈ ఇద్దరు విద్యార్థులు సన్‌రైజ్ క్రికెట్ అకాడమీలో కోచ్ షేక్ అమాన్ మార్గదర్శకత్వంలో క్రికెట్‌లో శిక్షణ పొందుతున్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే స్థాయికి ఎదిగారు.

ప్రతిభకు వేదికగా 'సన్‌రైజ్' క్రికెట్ అకాడమీ..

గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు చెందిన ఎంతోమంది ప్రతిభావంతులైన యువ క్రీడాకారులకు సరైన శిక్షణ, మార్గదర్శకత్వం అందించి వారి ప్రతిభను వెలుగులోకి తీసుకురావడంలో సన్‌రైజ్ క్రికెట్ అకాడమీ కీలకపాత్ర పోషిస్తోంది. క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం పెంపొం దిస్తూ, క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందించి జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి పోటీల వరకు ఎదిగేలా కోచ్ షేక్ అమాన్ నిరంతరం కృషి చేస్తున్నారు. మారుమూల ప్రాంతాల విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించడం అకాడమీ ప్రత్యేకతగా నిలుస్తోంది. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న సాయి సమర్థ కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందానికి అకాడమీ కోచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న దేశ్‌ముఖ్ రుద్ర, త్రిశూల్ నాయక్‌లను పలువురు అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రాంత యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తూ, ప్రతిభావంతులైన క్రీడాకారులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు 'సన్‌రైజ్ క్రికెట్ అకాడమీ' చేస్తున్న కృషిపై క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సర్ సిల్క్ ప్రజలకు అండగా బీఆర్ఎస్

- **ఇళ్ల ఖాళీ నోటీసులపై బాధితులకు భరోసా.. న్యాయపోరాటానికి సిద్ధమని వెల్లడి**

ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్: సర్ సిల్క్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలకు ఇళ్ల ఖాళీ నోటీసులు అందడంతో బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ పార్టీ ముందుకొచ్చింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ లీగల్ టీమ్ కాగజ్‌నగర్‌కు చేరుకుని బాధితులతో సమావేశమైంది. నోటీసులు అందుకున్న కుటుంబాల సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పత్రాలను సేకరించింది. సీనియర్ న్యాయవాదులతో పత్రాలను పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా న్యాయపోరాటం చేస్తామని భరోసా ఇచ్చింది. ఈ సందర్భంగా సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ.. సర్ సిల్క్ ప్రాంత ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి అండగా ఉంటానని స్పష్టం చేశారు. ప్రజల ఇళ్లను ఖాళీ చేయించే ప్రయత్నాలను న్యాయపరంగా అడ్డుకుంటామని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ధైర్యం చెప్పారు. "మొదట నా ఇంటిని కూల్చిన తర్వాతే మీ ఇళ్ల జోలికి రావాలి" అంటూ ప్రజలకు భరోసా కల్పించారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి, డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సర్ సిల్క్ ప్రజలు ఇళ్ల విషయంలో ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని, బీఆర్ఎస్ పార్టీ వారికి అండగా ఉంటుందని తెలిపారు. సీనియర్ న్యాయవాదులతో చర్చించి బాధిత కుటుంబాల హక్కుల పరిరక్షణకు న్యాయపరమైన పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. గత ఆరు దశాబ్దాలుగా సర్ సిల్క్ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల ఇళ్ల పరిరక్షణే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాచరణ చేపట్టిందని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారి హక్కుల కోసం పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.



పేద ప్రజలకు ఆసరాగా చేయూత పెన్షన్లు

- **లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్**



ఉద్యమ కెరటం, నేరడిగొండ(ఇచ్చోడ): పేద, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, వారి జీవనానికి అండగా నిలవడమే ప్రజా సంక్షేమ పథకాల ప్రధాన ఉద్దేశమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని స్థానిక షార్క్ గార్డెన్‌లో నిర్వహించిన నూతన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 1008 మంది అర్హులైన లబ్ధిదారులకు చేయూత పెన్షన్ ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితర అర్హులైన పేదలకు పెన్షన్లు అందించడం ద్వారా ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు. పెన్షన్ సొమ్ము వారి రోజువారీ అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతూ, కష్టకాలంలో అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పేద ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సాత్ నంబర్ గ్రామ సర్పంచ్ రమేష్ రాథోడ్, ఉప సర్పంచ్ షబ్బీర్, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంఐఎం కృషి

- **పదో తరగతి విద్యార్థులకు సాలారే మిల్లత్ గైడ్స్ ఉచిత పంపిణీ**



ఉద్యమ కెరటం, గంభీరావుపేట: ముస్లిం విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంఐఎం కృషి చేస్తుందని ఎంఐఎం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. ముస్లిం విద్యార్థుల విద్యాభివృద్ధి, ఉర్దూ మీడియం పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఉచిత విద్యా సహాయ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం సిరిసిల్ల, గంభీరావుపేట, వేములవాడ పట్టణాల్లోని ప్రభుత్వ ఉర్దూ మీడియం బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్–2026 గైడ్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తులో పదో తరగతి పరీక్షలు కీలకమైన మైలురాయని, వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు సాలారే మిల్లత్ గైడ్స్ ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. దివంగత హైదరాబాద్ మాజీ ఎంపీ సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో 26ఏళ్ల క్రితం ఈ ఉచిత గైడ్స్ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏటా ఉచితంగా గైడ్స్ పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ అధినేత, ఎంపీ బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీల నాయకత్వంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉర్దూ భాష పరిరక్షణతో పాటు ఉర్దూ మీడియం పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, ముస్లిం విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ ఎంఐఎం నాయకులు మహమ్మద్ ముస్తఫా, పర్వేజ్, సమీ, గంభీరావుపేట ఎంఐఎం నాయకులు ఇర్ఫాన్ ఖాన్, షోయబ్, గౌస్, హమీద్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించాలి



ఉద్యమ కెరటం, సిరిసిల్ల: రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఉద్యమంలో భాగంగా సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జర్నలిస్టులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేసి, అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, సమాజానికి నిరంతరం సేవలందిస్తున్న పాత్రికేయులకు వృద్ధాప్యంలో ఆర్థిక భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. జర్నలిస్టులు తమ జీవితాలను ప్రజాసేవకు అంకితం చేస్తూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాత్రికేయుల సంక్షేమాన్ని ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, అర్హులైన ప్రతి పాత్రికేయులకు పింఛన్ సౌకర్యం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు దాసరి దేవేందర్, శ్యామ్ కుమార్, ఏగుర్ల తిరుపతి, హరిబాబు, రాపెల్లి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపిల్ల పెళ్లికి పెద్దమనసుతో చేయూత

• దుడ్డెల కొమురయ్య–ఎల్లమ్మల జ్ఞాపకార్థం పుస్తె మట్టెల పంపిణీ

ఉద్యమ కెరటం, జవహర్‌నగర్: దివంగత కాప్రేడ్ దుడ్డెల కొమురయ్య– ఎల్లమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు బిజిలి రవీందర్ పేదింటి ఆడపిల్ల వివాహానికి పుస్తె మట్టెలు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. అలాగే బూడిద వెంకటేష్ 25 కిలోల బియ్యం బస్తాను అందజేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర జనరల్ సెక్రటరీ మెరుగు శివకృష్ణ ఆధ్వర్యంలో, న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ అధ్యక్షుడు వేల్పుగొండ వెంకటస్వామి చొరవతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. జవహర్‌నగర్ వికలాంగుల కాలనీలోని బిజిలి టీవీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిజాంపేట్–బాచుపల్లి మండలానికి చెందిన దివ్యాంగ కుటుంబ సభ్యులు మల్లిగారి సత్యనారాయణ, మల్లిగారి స్వప్న దంపతుల రెండో కుమార్తె మల్లిగారి సౌజన్య రూప వివాహం సందర్భంగా ఈ సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబాలు నిత్యజీవిత అవసరాలకే ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అలాంటి పరిస్థితుల్లో ఆడపిల్లల వివాహం మరింత భారంగా మారుతోందని అన్నారు. పేద తల్లిదండ్రులకు వివాహ ఖర్చులు భారం కాకూడదనే ఆలోచనతో తమవంతు సహాయం అందించినట్లు తెలిపారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారి ఆశయాలను సజీవంగా నిలబెట్టుకోవడం ఎంతో సంతృప్తినిస్తుందని బిజిలి రవీందర్



పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ అధ్యక్షుడు వేల్పుగొండ వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి టి. చిరంజీవి, సొసైటీ సభ్యుడు రాజనాల కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకుడు బండకింది ప్రసాద్, రెండో డివిజన్ సెక్రటరీ బూడిద వెంకటేష్, సీనియర్ పత్రికా విలేకరి దుర్గమ్మ స్వామి, బలగం టీవీ సీఈఓ చింతల విజయ్ కుమార్, స్టార్ న్యూస్ టీవీ9 రఘు తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతం చేయాలి

• వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి వాకిటి శ్రీహరి

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026ను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, జిల్లాలో విస్తృత ప్రచారం కల్పిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. సోమవారం రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ.వాణీ ప్రసాద్ తదితరులు జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు సంబంధించి జిల్లాల్లో చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమాలు, ఏర్పాట్లపై మంత్రి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డిసెంబర్ 11 నుంచి 22 వరకు 12 రోజుల పాటు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం కల్పించాలని, ప్రజలు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో పండుగ వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహించాలని,





ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రారంభోత్సవాలు చేపట్టాలని, పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధాన మంత్రి ఈ కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ప్రతి ఏర్పాటును ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించాలని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఖేలో ఇండియా ప్రాధాన్యతను తెలియజేస్తూ వార్తాపత్రికల్లో ప్రత్యేక కథనాలు ప్రచురించేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి గురుకుల పాఠశాల, విద్యాసంస్థకు ఖేలో ఇండియా కార్యక్రమంపై అవగాహన కల్పించాలని, విద్యార్థులు, యువత భాగస్వామ్యంతో టార్చ్‌లైట్ ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు. యువత మాదకద్రవ్యాలు, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకునేలా ఈ కార్యక్రమం దోహదపడాలని పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, వివిధ సంస్థల నుంచి 6వేల మందికి పైగా యువ క్రీడాకారులు, 1,800 మంది సహాయక సిబ్బంది ఈ క్రీడా సంబరాల్లో పాల్గొననున్నారని తెలిపారు. మొత్తం 29 క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. హైదరాబాద్‌తో పాటు ఖమ్మం, హనుమ కొండ, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా క్రీడా శాఖ అధికారులు దయానంద్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

• విజేతలకు బహుమతులు అందజేసిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

ఉద్యమ కెరటం, తాండూర్: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ జీవితంలోని అన్ని రంగాల్లో ముందుండాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, ఐక్యత, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. సోమవారం తాండూర్ ఐబీ సర్కిల్ కార్యాలయ మైదానంలో ఈనెల 3 నుంచి నిర్వహించిన ఐబీ ప్రీమియర్ లీగ్-2 క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కార్ల్స్ బర్గ్, సార్ల రమేష్ జట్లు తలపడగా కార్ల్స్ బర్గ్ జట్టు విజయం సాధించి టోర్నమెంట్ విజేతగా నిలిచింది. అనంతరం



నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య విజేత జట్టుకు నగదు బహుమతులు, షీల్డులు అందజేశారు. ఈ పోటీలకు సంబంధించిన నగదు బహుమతులను ఆయన సొంతంగా అందించడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడా రంగంలో ప్రతిభను చాటుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. క్రికెట్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఫైనల్ మ్యాచ్‌లో బెస్ట్ ప్లేయర్‌గా సాయి ఈశ్వర్, టోర్నమెంట్‌లో అత్యంత విలువైన ఆటగాడిగా కానిస్టేబుల్ విజయ్ ఎంపికై పతకాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బ దత్తు మూర్తి, మాజీ జడ్పీటీసీ మంగపతి సురేష్ బాబు, బీఆర్ఎస్ నాయకులు ఎలుక రామచందర్, దత్తాత్రేయ రావు, గట్టు సంతోష్ కుమార్, మసాడి శ్రీరాములు, బోనగిరి చంద్రశేఖర్, దుగుట శ్రీనివాస్, బోడ సతీష్, జాడి పోశం, క్రిస్టఫర్, పుప్పాల తిరుపతి, ప్రదీప్ రావు, బాబు ఖాన్, చింటూ, ఇక్బాల్, రాకేష్, ఇతర నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

• నూతన పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్ పథకంలో భాగంగా నూతనంగా ఎంపికైన లబ్ధిదారులకు సోమవారం సిర్పూర్ రైతు వేదికలో పింఛన్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు అందించడం ద్వారా వారి జీవనానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సమాజంలోని బలహీన వర్గాలకు అండగా నిలిచి, వారి జీవన ప్రమాణాలను మెరుగు పర్చడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రజల సంక్షేమం, అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అర్హులైన వారెవరూ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నూతన పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



వెంకట్రావుపేట రహదారికి మరమ్మతులు చేపట్టాలి



ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్: సిర్పూర్(టి) మండలం వెంకట్రావుపేట గ్రామంలో అధ్వానంగా మారిన రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టి, శాశ్వత పరిష్కారంగా నూతన రహదారిని నిర్మించాలని కోరుతూ దుర్గం రత్నాకర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడటంతో ప్రజలు, రైతులు, విద్యార్థులు, వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల భయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని, వర్షాకాలంలో రహదారి మరింత అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు అస్లాం బిన్ అబ్దుల్లా, పనస లక్ష్మణ్, లక్ష్మణ్‌తో పాటు వెంకట్రావుపేట గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



ఉద్యమ కెరటం, తాండూర్: రాబోయే వేసవి కాలం, ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం చేపట్టిన ముందస్తు సన్నాహక ప్రత్యేక డ్రైవ్ సోమవారం తాండూర్ మండలంలో ప్రారంభమైంది. ఇందులో భాగంగా తొలిరోజు నీలైపల్లి, ఒడ్డెర కాలనీ, రాజీవ్ నగర్ హ్యాబిటేషన్లలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కూడిన ప్రత్యేక బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు, మిషన్ భగీరథ అంతర్గత పైపులైన్లు, నీటి సరఫరా, చివరి ఇంటి వరకు నీరు అందుతున్న తీరును అధికారులు పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ నీటి వనరులుగా ఉపయోగపడే చేతిపంపులు, బోర్‌వెల్స్ పనితీరును తనిఖీ చేశారు. మరమ్మతులు అవసరమైన చోట తక్షణమే పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రాబోయే వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా మండలంలోని అన్ని హ్యాబిటేషన్లలో దశలవారీగా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్, ఏఈఈ (ఇంట్రా) మనోహర్, ఏఈఈ(గ్రిడ్) ఖదీర్, నీలైపల్లి సర్పంచ్ తిరుపతి, రాజీవ్ నగర్ సర్పంచ్ మామిడాల లలిత రాజేశం, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం నుంచి ఢిల్లీ వరకు నషా ముక్త్ భారత్ సైకిల్ యాత్ర

నేరడిగొండ కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన



ఉద్యమ కెరటం, నేరడిగొండ: మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరానికి చెందిన ఇందుకూరి విజయలక్ష్మి పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ లక్ష్యంగా భీమవరం నుంచి ఢిల్లీ వరకు చేపట్టిన సైకిల్ యాత్రలో భాగంగా సోమవారం ఆమె నేరడిగొండ మండల కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నేరడిగొండ కేజీబీవీలో పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆమెకు ఘన స్వాగతం పలికింది. అనంతరం స్థానిక ఎస్సై ఇమ్రాన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుకూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. "మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి ఆరోగ్యాన్నే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల రహిత భారతదేశ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ రజిత, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

నూతన సీఐ సాయినాథ్‌కు ఘన సన్మానం



ఉద్యమ కెరటం, బోథ్: మండల కేంద్రానికి నూతనంగా బదిలీపై వచ్చిన సీఐ సాయినాథ్‌ను బోథ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేరుగు భోజన్న ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకు శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం మేరుగు భోజన్న మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ బోథ్ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజలు, పోలీస్ శాఖ మధ్య సత్సంబంధాలు కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కుర్మే మహేందర్, మండల అధికార ప్రతినిధి అచ్యుత్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కౌసర్, ప్రధాన కార్యదర్శి అబూద్, ఉపసర్పంచ్ పూర్ణ విజయ రాజారెడ్డి, వార్డు సభ్యులు షాకీర్, పద్మారావు, ఆత్మ డైరెక్టర్ రహీంద్దీన్, మాజీ ఎంపీటీసీ షేక్, నాయకులు మొహమ్మద్, బొజ్జ సాయన్న, అబ్రార్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షణే లక్ష్యం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలకు మీడియాలో ప్రాధాన్యం కరవు!

- రాజకీయ పార్టీలకు అనుబంధంగా మారుతున్న కొన్ని మీడియా సంస్థలు
- సమాజ శ్రేయస్సు కంటే ఇతర ప్రయోజనాలకే పెద్దపీట
- పత్రికా స్వేచ్ఛను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది
- ఒత్తిళ్ల మధ్య స్వతంత్రంగా పనిచేయలేకపోతున్న జర్నలిస్టులు
- వార్తల ఆకర్షణ కోసం వాస్తవాలు, విలువలను బలిచేయొద్దు
- జాతీయ పత్రికా దినోత్సవ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం





హైదరాబాద్, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాల్సిన మీడియా ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం తగ్గిపోతోందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన స్రవంతిలోని కొన్ని మీడియా సంస్థలు రాజకీయ పార్టీలకు అనుబంధంగా మారిపోవడంతో ప్రజా సమస్యలు మరుగునపడుతున్నాయని అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ మీడియా అకాడమీ, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలోని మీడియా అకాడమీ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోదండరాం మాట్లాడుతూ ప్రజా సమస్యలను ధైర్యంగా వెలుగులోకి తెస్తున్న స్వతంత్ర జర్నలిస్టులను అభినందించారు. రవీష్‌కుమార్ వంటి పాత్రికేయులు, ది వైర్ వంటి సంస్థలు చేస్తున్న కృషిని ప్రశంసించారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ జర్నలిస్టులు స్వేచ్ఛగా, స్వతంత్రంగా పనిచేసే పరిస్థితులు క్షీణిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విలేకరుల నుంచి సంపాదకుల వరకు తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ పెద్దలకు నచ్చని విమర్శనాత్మక కథనాలు రాసిన జర్నలిస్టుల ఉద్యోగాలకు సైతం ముప్పు ఏర్పడుతోందన్నారు. పత్రికా వ్యవస్థను పరిరక్షించుకోవడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలమని స్పష్టం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం మాజీ అధిపతి ప్రొఫెసర్ పద్మజాషా మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ప్రభావంతో వార్తల వినియోగంలో పెనుమార్పులు వస్తున్నాయన్నారు. ఒక సర్వే ప్రకారం 58 శాతం మంది వార్తల కోసం సామాజిక మాధ్యమాలపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వాలకు నచ్చని కథనాలను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించేలా ఒత్తిళ్లు వస్తున్నాయని ఆరోపించారు. వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రధాన స్రవంతి మీడియా కార్పొరేట్ సంస్థల ఆధిపత్యంలోకి వెళ్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పత్రికా రంగం ఎదుర్కొంటున్న కీలక సమస్యలను పక్కనపెట్టి జాతీయ పత్రికా దినోత్సవానికి అప్రధానమైన చర్చాంశాన్ని ఎంపిక చేయడం విచారకరమన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ మాట్లాడుతూ జర్నలిజం ప్రజలను ఆకర్షించడానికా, సమాజం పట్ల బాధ్యత నిర్వర్తించడానికా అనే ప్రశ్న తలెత్తుతోందన్నారు. పాఠకులు, వీక్షకుల సంఖ్య పెంచుకునేందుకు సంచలన శీర్షికలు, అర్ధసత్యాలు, నిర్ధారణ కాని వార్తలకు ప్రాధాన్యం ఇవ్వడం సమాజానికి మేలు చేయదని స్పష్టం చేశారు. మీడియా ప్రజాకర్షకంగా ఉండటంలో తప్పులేదని, అయితే ఆ ఆకర్షణ కోసం వాస్తవాలు, నైతిక విలువలను బలిచేయకూడదని సూచించారు. పత్రికా స్వేచ్ఛ, నైతిక ప్రమాణాల పరిరక్షణ కోసం ఏర్పాటైన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్వతంత్రతను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సీనియర్ పాత్రికేయులు డాక్టర్ కె.రాంచంద్రమూర్తి, సియాసత్ మేనేజింగ్ ఎడిటర్ ఆమెర్ అలీఖాన్, నాగసూరి వేణుగోపాల్, మల్లేపల్లి లక్ష్మయ్య, డాక్టర్ నిజామి, సామాజిక కార్యకర్త కె.సజయ, ఐజేయూ నాయకులు ఎం.ఏ.మాజీద్, వై.నరేందర్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, కల్కూరి రాములు, ఏ.రాజేష్, బి.కిరణ్‌కుమార్, హెచ్‌యూజే అధ్యక్షుడు శిగా శంకర్‌గౌడ్, యూసుబాబు, అశోక్, కళ్యాణం రాజేశ్వరి, అత్తలూరి అరుణ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా జర్నలిస్టు చారి జన్మదిన వేడుకలు



ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్: రచయిత, కవి, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే–ఐజేయు) జిల్లా సహాయ కార్యదర్శి చిలుకూరి రాధాకృష్ణ చారి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ జర్నలిస్టులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూ జే జిల్లా ఉపాధ్యక్షుడు మేకల శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే జిల్లా నాయకుడు తుమోజు సురేష్ చారి, నాయకులు షాహిద్, బాబర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణం నౌగాం బస్తీకి చెందిన మోతే పోచమ్మ తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ పట్టణం నూర్ నగర్ కు చెందిన పాటిల్ జగన్నాథ్ తన ఆస్తిని తన పిల్లలు మొత్తం తీసుకొని, తన పోషణ పట్టించుకోవడం లేదని, తన ఆస్తిని తనకు అప్పగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. వాంకిడి మండలం బెండారా గ్రామానికి చెందిన వేములవాడ హారిక తనకు ఆశా వర్కర్ గా ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సిర్పూర్ –యు మండలం పాములవాడ గ్రామానికి చెందిన ఆత్రం అర్జుబాయి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ పట్టణం బాలాజీ నగర్ కు చెందిన గజ్జల పెళ్లి స్వప్న తనకు రెండు పడక గదుల ఇల్లు కేటాయించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కెరమెరి మండలం చౌపన్ గూడ గ్రామానికి చెందిన గిరిజనులు తమ వ్యవసాయ భూములకు బావులు, బోరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామానికి చెందిన మేకార్తి గోపాల్, తనకు తన తండ్రి నుండి వచ్చిన భూమిని



సమానంగా పంచి ఇవ్వలేదని, ఈ విషయమై విచారించి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. పిల్లల ప్రజావాణిలో ఆసిఫాబాద్ మండలం వావుదాం గ్రామానికి చెందిన విద్యార్థులు తమ గ్రామంలో గల తెలంగాణ సంక్షేమ ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం, త్రాగునీరు, వంటశాల, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చింతల మానేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన దుర్గం అచ్యుతవల్లి అనే 6వ తరగతి విద్యార్థిని తనకు కరీంనగర్ జిల్లా చింతకుంట లో గల సాంఘిక సంక్షేమ పాఠశాలలో సీటు వచ్చిందని, తనకు దూరము అవుతున్నందున జిల్లాలో ఏదైనా గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, దరఖాస్తులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పిల్లల ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.



ఖేలో ఇండియాపై విస్తృత ప్రచారం

జిల్లా కలెక్టర్ కె.హరిత

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ : డిసెంబర్ 11 నుండి 22వ తేదీ వరకు రాష్ట్రంలో నిర్వహించనున్న ఖేలో ఇండియా క్రీడల కార్యక్రమం పై జిల్లాలో విస్తృత ప్రచారం చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, క్రీడల శాఖ కార్యదర్శి వాణి ప్రసాద్, క్రీడల శాఖ ఎం.డి. సోని బాలదేవి లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు యువజన క్రీడా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా యువజన సేవల క్రీడా శాఖ అధికారి అశ్వక్ అహ్మద్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతను క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చేనెల 11 నుండి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా కార్యక్రమంపై జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ర్యాలీలు నిర్వహించి పెద్ద ఎత్తున క్రీడాకారులు యువజన సంఘాలు పాల్గొనేలా చర్యలు తీసుకుంటామని, మండల కేంద్రాలలో, మున్సిపాలిటీలలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి, ఖేలో ఇండియా ప్రాముఖ్యతను తెలియజేసేందుకు కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు

అభివృద్ధి పనులను నాణ్యతతో చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ : విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, మిషన్ అమృత్ జల్ పనులు, ప్రీ–ప్రైమరీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 'విద్యా ప్లస్' బోధనా విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశిస్తూ, విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు డిజిటల్, ఆధునిక బోధనా పద్ధతుల ద్వారా నాణ్యమైన విద్య అందించాలని, ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గోయెగావ్ గ్రామంలో చేపడుతున్న మిషన్ అమృత్ జల్ పనులను పరిశీలించారు. పనుల పురోగతి, నిర్మాణ నాణ్యత, అమలు తీరుపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ, నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని ప్రీ–ప్రైమరీ పాఠశాలను సందర్శించి చిన్నారులకు అందిస్తున్న విద్యాబోధన, మౌలిక సదుపాయాలు, పౌష్టికాహార పంపిణీ తీరును పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పాఠశాల పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యా ప్రమాణాల పెంపు, అభివృద్ధి పనుల నాణ్యత, చిన్నారులకు మెరుగైన సదుపాయాల కల్పనకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత విద్యాశాఖ, స్థానిక సంస్థల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షణే లక్ష్యం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



భయంతో నిద్రలేని రాత్రులు గడిపా

ఇంట్లో దెయ్యం ఉందేమోనని వణికిపోయా!


ఆసక్తి రేపుతున్న శ్రుతిహాసన్ వ్యాఖ్యలు

చెన్నై, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): తన ఇంట్లో దెయ్యం ఉందేమోనని భయపడిన సందర్భాలు ఉన్నాయని ప్రముఖ సినీనటి శ్రుతిహాసన్ వెల్లడించినట్లు కథనాలు వెలువడుతున్నాయి. చెన్నైలోని తన ఇంట్లో ఓ బొమ్మ కారణంగా ఎదురైన వింత అనుభవాలు తనను తీవ్ర భయాందోళనలకు గురిచేశాయని ఓ ఇంటర్వ్యూలో చెప్పినట్లు సమాచారం. ఎవరూ ముట్టుకోకుండానే బొమ్మ ఒకచోటు నుంచి మరోచోటుకు మారిపోతుండటంతో ఏం జరుగుతోందో అర్థంకాక వణికిపోయానని ఆమె వివరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. తన ఇంట్లో మనిషి పరిమాణంలో ఉండే ఓ బొమ్మ ఉండేదని, దానికి 'ఫియోనా' అని పేరు పెట్టుకున్నానని శ్రుతిహాసన్ తెలిపినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఇంటికి వచ్చిన స్నేహితులు కూడా ఆ బొమ్మను సరదాగా పలకరించేవారని, మొదట్లో దానిని సాధారణ బొమ్మగానే భావించానని చెప్పారట. అయితే కొంతకాలానికి ఆ బొమ్మను ఒకచోట ఉంచితే మరోచోట కనిపించడంతో ఆశ్చర్యానికి గురయ్యానని వెల్లడించినట్లు సమాచారం. ముఖ్యంగా ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఇలాంటి అనుభవాలు ఎదురవడంతో భయం మరింత పెరిగిందని చెప్పారట. ఇంట్లో ఏదో అదృశ్య శక్తి ఉన్నట్లు అనిపించేదని, ఆ భయాన్ని అధిగమించేందుకు హనుమాన్ చాలీసా వినడంతోపాటు చేతిలో ఉప్పు పట్టుకుని ప్రార్థనలు చేసేదాన్నని శ్రుతిహాసన్ వివరించినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ బొమ్మ విషయంలో భయం తగ్గకపోవడంతో చివరకు దానిని ఇంటి నుంచి తొలగించాలని నిర్ణయించుకున్నారట. బొమ్మను పూర్తిగా విడదీసి, భాగాలను బయటకు పంపించేసినట్లు తెలిపారట. అనంతరం మనశ్శాంతి కోసం ఇంట్లో పూజలు నిర్వహించుకున్నానని, ఆ తర్వాత ప్రశాంతంగా అనిపించిందని చెప్పినట్లు సమాచారం. తనకు ఎదురైన అనుభవం ఓ భయానక చిత్రంలోని సన్నివేశాన్ని తలపించిందని శ్రుతిహాసన్ వ్యాఖ్యానించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే బొమ్మ నిజంగానే దానంతట అదే కదిలిందనడానికి స్వతంత్ర ఆధారాలు లేవు. ఆమె వ్యక్తిగత అనుభవంగా ప్రచారంలో ఉన్న ఈ కథనం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

పెళ్లి తర్వాతా తగ్గేదేలే..

వివాహం తర్వాత కూడా వైవిధ్యమైన పాత్రలపై దృష్టి

కెరీర్‌కు పెళ్లి అడ్డుకాదని చాటుతున్న 'మహానటి'



హైదరాబాద్, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): సినీ పరిశ్రమలో పెళ్లి తర్వాత కథానాయికలకు అవకాశాలు తగ్గుతాయనే పాత అభిప్రాయానికి భిన్నంగా కీర్తి సురేష్ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. 2024 డిసెంబర్ 12న తన చిరకాల మిత్రుడు ఆంటోనీ తట్టిల్‌ను వివాహం చేసుకున్న ఈ 'మహానటి' సినిమాలకు విరామం ఇవ్వకుండా వరుస ప్రాజెక్టులతో బిజీగా మారింది. వివాహమైన కొద్దిరోజులకే వరుణ్ ధావన్ సరసన నటించిన 'బేబీ జాన్' చిత్రం విడుదల కావడం విశేషం. ఆ తర్వాత 'ఉప్పు కప్పురంబు', 'రివాల్వర్ రీటా' వంటి చిత్రాలతో ప్రేక్షకులను పలకరించింది. కేవలం సంప్రదాయ పాత్రలకే పరిమితం కాకుండా విభిన్న కథాంశాలు, పాత్రలను ఎంచుకుంటూ తన నటనలో కొత్త కోణాలను ఆవిష్కరించేందుకు ప్రయత్నిస్తోంది. కథానాయికగా నటించడంతోపాటు ప్రత్యేక గీతాల్లో కనిపించేందుకూ ఆసక్తి చూపుతోందన్న ప్రచారం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మరోవైపు అగ్ర కథానాయకుల చిత్రాల్లోనూ ఆమె పేరు వినిపిస్తోంది. అయితే ప్రచారంలో ఉన్న కొన్ని కొత్త చిత్రాలు, ప్రత్యేక గీతాలు, విడుదల తేదీలపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. 'మహానటి'తో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కీర్తి సురేష్ తన కెరీర్‌లో వైవిధ్యానికి ప్రాధాన్యం ఇస్తోంది. పెళ్లి తర్వాత కూడా కథానాయికగా అవకాశాలను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతోంది. మొత్తానికి వ్యక్తిగత జీవితాన్ని, సినీ ప్రయాణాన్ని సమన్వయం చేసుకుంటూ కీర్తి సురేష్ తనదైన శైలిలో దూసుకుపోతోంది.





జుట్టు కత్తిరించుకున్నానని చెప్పగానే అమ్మ ఫోన్ పెట్టేసింది!

ఆసక్తికర విషయాన్ని వెల్లడించిన సాయిపల్లవి



హైదరాబాద్, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): సహజమైన అందం, అద్భుతమైన నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న కథానాయిక సాయిపల్లవి తాజాగా తన జుట్టు గురించి వెల్లడించిన ఆసక్తికర విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పాత్ర కోసం తన పొడవాటి ఉంగరాల జుట్టును కత్తిరించుకోవడంతో తల్లి తీవ్రంగా బాధపడ్డారని, ఆ విషయం చెప్పగానే ఫోన్ పెట్టేశారని సాయిపల్లవి వెల్లడించినట్లు ప్రచారం జరుగుతోంది. మేకప్‌కు దూరంగా ఉంటూ సహజమైన అందంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సాయిపల్లవి తన జుట్టు విషయంలో తీసుకున్న నిర్ణయం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 'అమరన్' చిత్ర దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్న 'ఓఎం' చిత్రంలో సాయిపల్లవి ఐపీఎస్ అధికారిణిగా కనిపించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమె పాత్ర పేరు నిత్యారెడ్డి అని ప్రచారం జరుగుతోంది. నిజజీవిత ఐపీఎస్ అధికారిణి మెరిన్ జోసెఫ్ రూపాన్ని స్ఫూర్తిగా తీసుకుని దర్శకుడు ఈ పాత్రను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. పాత్రకు సహజత్వం తీసుకురావాలనే ఉద్దేశంతో సాయిపల్లవి పొడవాటి జుట్టును కత్తిరించుకునేందుకు సిద్ధమైనట్లు సినీ వర్గాల సమాచారం. అయితే ఈ నిర్ణయం ఆమె తల్లికి ఏమాత్రం నచ్చలేదట. చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టంగా పెంచుకున్న జుట్టును సినిమా కోసం కత్తిరించుకున్నట్లు సాయిపల్లవి ఫోన్‌లో చెప్పగానే తల్లి ఆశ్చర్యానికి గురై మాట్లాడకుండా ఫోన్ పెట్టేశారట. కొంతకాలం ఆ విషయాన్ని జీర్ణించుకోలేకపోయారని సాయిపల్లవి చెప్పినట్లు కథనాలు వెలువడుతున్నాయి. సాధారణంగా సినీ తారలు పాత్రలకు అనుగుణంగా విగ్గులు, ఇతర సాంకేతిక పద్ధతులను ఉపయోగిస్తుంటారు. కానీ పాత్రలో పూర్తిగా ఒదిగిపోయేందుకు సాయిపల్లవి తన రూపాన్ని మార్చుకోవడం విశేషంగా మారింది. కథకు, పాత్రకు ప్రాధాన్యం ఇచ్చే నటిగా ఇప్పటికే గుర్తింపు తెచ్చుకున్న ఆమె తాజా నిర్ణయం మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే చిత్రం, పాత్ర వివరాలతోపాటు జుట్టు కత్తిరించుకోవడంపై ఆమె చేసిన వ్యాఖ్యలకు అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది.



హీరో తేజ సజ్జా నిశ్చితార్థం!

కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వేడుక

హైదరాబాద్, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): యువ కథానాయకుడు తేజ సజ్జా త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నారు. సోమవారం హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఆయన నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు ప్రముఖ నటుడు చిరంజీవి, రవితేజ, రానా, శివాజీ, వరలక్ష్మి శరత్‌కుమార్ దంపతులు వేడుకలో పాల్గొన్నారు. దర్శకులు కె.రాఘవేంద్రరావు, ప్రశాంత్ వర్మ, కార్తీక్ ఘట్టమనేని, నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, సాహూ గారపాటి తదితరులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. డిసెంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్ వేదికగా తేజ సజ్జా వివాహం జరగనున్నట్లు సమాచారం. అనంతరం హైదరాబాద్‌లో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం వివాహ విందు ఏర్పాటు చేయనున్నారు. కాగా, తమది పెద్దలు కుదిర్చిన వివాహమని తేజ సజ్జా ఇటీవల వెల్లడించారు. వధువు కుటుంబానికి సినీ పరిశ్రమతో సంబంధం లేదని, వారు సాంకేతిక రంగానికి సంబంధించిన వ్యాపారంలో ఉన్నారని తెలిపారు. బాలనటుడిగా సినీ రంగంలోకి ప్రవేశించి, 'హనుమాన్', 'మిరాయ్' వంటి చిత్రాలతో కథానాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న తేజ సజ్జా జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టబోతున్నారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఐ హేట్ మ్యారేజ్'

ఆకట్టుకుంటున్న చిత్ర ట్రైలర్!

హైదరాబాద్, నవంబర్ 16 (ఉద్యమ కెరటం): యువ కథానాయకుడు సుగి విజయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఐ హేట్ మ్యారేజ్'. పరమేష్ రేణుకుంట్ల దర్శకత్వంలో మాదం దయానంద్, కార్తీక్ వెంపటి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంతో జువ్వీ భద్ర కథానాయికగా పరిచయం కానున్నారు. నవంబర్ 27న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం సోమవారం ట్రైలర్‌ను విడుదల చేసింది. ప్రేమ, పెళ్లి, కెరీర్‌తోపాటు స్వేచ్ఛగా జీవించాలనుకునే నేటితరం యువత ఆలోచనలను వినోదాత్మకంగా ఆవిష్కరించినట్లు దర్శకుడు తెలిపారు. యువత భావోద్వేగాలు, బంధాలు, వివాహంపై వారి అభిప్రాయాల చుట్టూ కథ సాగుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా చిత్రాన్ని రూపొందించామని, మంచి ఆదరణ లభిస్తుందనే నమ్మకం ఉందన్నారు. హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి విజయ్ సి.కుమార్ ఛాయాగ్రహణం అందించారు.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

ప్రజావాణి దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ఉద్యమ కెరటం, ఖమ్మం: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులు, దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలతో ప్రజలు అర్జీలను సమర్పించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీకి ప్రాధాన్యత ఇచ్చి, సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. రామమూర్తి, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ఉద్యమ కెరటం, మంచిర్యాల: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాంతో కలిసి ప్రజల నుంచి వినతులు, దరఖాస్తులు స్వీకరించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేసిన భూమిని ఇతరుల పేరుపై పట్టా చేశారని, తమకు తెలియకుండా ఇతరులు భూమి పట్టా చేయించుకున్నారని తదితర సమస్యలతో అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 58 దరఖాస్తులు అందాయని తెలిపారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన చోట క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. అదేవిధంగా నిరుపేదలకు న్యాయ సహాయం అందించేందుకు న్యాయ సేవాధికార సంస్థ తరపున జిల్లా న్యాయస్థానం నుంచి ఒక న్యాయవాది ప్రజావాణి కార్యక్రమంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలు, నిరుపేదలు తమ న్యాయపరమైన సమస్యలపై ఉచిత సలహాలు, సూచనలు పొందవచ్చని పేర్కొన్నారు. కోర్టుల్లో కేసుల నమోదు, న్యాయపరమైన సలహాలు, ఇతర అవసరమైన సహకారం కోసం న్యాయవాది సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



ఉద్యమ కెరటం, దుబ్బాక: గ్రామంలోని అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని బొప్పాపూర్ గ్రామ సర్పంచ్ మాధవనేని భానుప్రసాద్ అన్నారు. సోమవారం బొప్పాపూర్ గ్రామంలో నూతనంగా చేయూత పింఛన్లు మంజూరైన 17 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని వృద్ధులు, దివ్యాంగులు, ఇతర నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా గ్రామపంచాయతీ తరపున నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లభించే ప్రయోజనాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పింఛన్ లబ్ధిదారులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా అందని పీఎం కిసాన్ సాయం..

- ల్యాండ్ సీడింగ్ సమస్యతో రైతు ఇక్కట్లు..!
- ప్రజావాణిలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేత



ఉద్యమ కెరటం, నేరడిగొండ: పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు అందాల్సిన ఆర్థిక సాయం ల్యాండ్ సీడింగ్ సమస్య కారణంగా నిలిచిపోవడంతో ఓ రైతు గత నాలుగేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని బోరిగామ గ్రామానికి చెందిన రాథోడ్ సందీప్ తండ్రి నామ్‌దేవ్‌కు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 2021–22 సంవత్సరంలో పీఎం కిసాన్ పథకం కింద నగదు జమ కాగా, ఆ తర్వాత భూమికి సంబంధించిన ల్యాండ్ సీడింగ్ పూర్తికాలేదనే కారణంతో ఆర్థిక సాయం నిలిచిపోయిందని రైతు తెలిపారు. సమస్యను పరిష్కరించుకునేందుకు వ్యవ సాయ శాఖ అధికారులతో పాటు కలెక్టర్ కార్యాలయం, ఐటీడీఏ కార్యాలయాల చుట్టూ పలుమార్లు తిరిగినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా అధికారులకు విన్నవించుకుంటున్నా సమస్య అలాగే ఉండిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో సోమవారం నేరడిగొండ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసాగర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తన వ్యవసాయ భూమికి సంబంధించిన ల్యాండ్ సీడింగ్ సమస్యను పరిశీలించి, అవసరమైన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయించాలని కోరారు. తద్వారా పీఎం కిసాన్ పథకం కింద అర్హత ప్రకారం నిలిచిపోయిన ఆర్థిక సాయం తిరిగి అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, పీఎం కిసాన్ సాయం అందేలా న్యాయం చేయాలని రైతు కోరుతున్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



ఉద్యమ కెరటం, సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 19 నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ఈ పథకం అమలుపై సోమవారం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆర్డీవోలు, డీఆర్డీఓ, సీపీఓ, డీపీఓ, డీసీఎస్ఓ, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీఓలకు పలు సూచనలు చేశారు. జిల్లాలో మొత్తం 1లక్ష 92వేల కుటుంబాలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించాలని తెలిపారు. ఆయా గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో పథకానికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు తెలియజేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన రేషన్ కార్డు ఉన్నవారితో పాటు రేషన్ కార్డు లేనివారు కూడా ఈ పథకానికి అర్హులని స్పష్టం చేశారు. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన వారు బీమా పొందేందుకు అర్హులని తెలిపారు. లబ్ధిదారులు తమకు నచ్చిన విధంగా ఎంత మందినైనా నామినీలుగా ఎంపిక చేసుకోవచ్చని పేర్కొన్నారు. బీమా పరిహారానికి సంబంధించిన వివరాలను దరఖాస్తులో స్పష్టంగా నమోదు చేసి సంతకం చేయాలని సూచించారు. ఈ పథకం కింద ప్రతి కుటుంబానికి రూ.5లక్షల విలువైన జీవిత బీమా వర్తిస్తుందని వివరించారు. దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శిబిరాల వద్ద హెల్ప్ డెస్క్లు, టెంట్లు, కుర్చీలు, తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు అవసరమైన సిబ్బంది, యంత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి వీర భద్రయ్య, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: వేసవిలో ఎల్‌నినో ప్రభావం కారణంగా నీటి కొరత తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు, పశువులకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో తాగునీటి సరఫరా, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని చివరి గ్రామం నుంచి మారుమూల ఆవాసాల వరకు ఎలాంటి అంతరాయం లేకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. నీటి వృథాను అరికట్టేందుకు పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. పశువులకు సైతం తాగునీటి కొరత లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని ప్రజలు, రైతులు పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. సాంప్రదాయ పంటలతో పాటు ఉద్యాన పంటలు, కూరగాయలు, పామాయిల్, నూనెగింజల సాగును ప్రోత్సహించి పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.జిల్లాలో తాగునీరు, సాగునీరు, పశువులకు అవసరమైన నీరు, పశుగ్రాసం విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటించి పరిస్థితులను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. సమస్యలను గుర్తించిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- మంత్రి వివేక్ వెంకటస్వామి
- అక్బర్‌పేట్ భూంపల్లిలో 1,924 కొత్త చేయూత పింఛన్లు, 523 ఇందిరమ్మ పట్టాల పంపిణీ
- ఈనెల 19న సిద్దిపేటలో సీఎం చేతుల మీదుగా ఇందిరమ్మ కుటుంబ బీమా ప్రారంభం



ఉద్యమ కెరటం, అక్బర్‌పేట్ భూంపల్లి: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. సోమవారం అక్బర్‌పేట్ భూంపల్లి మండల కేంద్రంలోని రామలింగేశ్వర గార్డెన్స్‌లో స్థానిక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కె.హైమావతితో కలిసి దుబ్బాక నియోజకవర్గ లబ్ధిదారులకు 1,924 కొత్త చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు, 523 రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.8లక్షల కోట్ల అప్పులు చేసినా, తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఆపలేదని అన్నారు. దుబ్బాకకు మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని, ఇప్పుడు రెండో విడతలో మరో 2వేల ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.10లక్షల ఆరోగ్యశ్రీ, సన్నబియ్యం పంపిణీతో పాటు దుబ్బాకకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేశామని తెలిపారు. ఈనెల 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.5లక్షల ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని చేనేత కార్మికులం దరికీ పింఛన్లు ఇవ్వాలని, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని, దుబ్బాకను కరువు మండలంగా ప్రకటించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ కె.హైమావతి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక దరఖాస్తుల పరిశీలన తర్వాతే అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరు చేశామన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ధరిపెల్లి చంద్రం, దుబ్బాక మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరాం సంగీత, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఉప సర్పంచుల సమస్యలను పరిష్కరించాలి



ఉద్యమ కెరటం, సిర్పూర్(యు): గ్రామపంచాయతీల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఉప సర్పంచుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సిర్పూర్(యు) మండల ఉప సర్పంచుల ఫోరం సభ్యులు కోరారు. ఫోరం అధ్యక్షుడు పెందూర్ రామారావు ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచులు మాట్లాడుతూ.. ఉప సర్పంచులకు గౌరవ వేతనం చెల్లించాలని, గ్రామాభివృద్ధి పనుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. గ్రామసభలు, అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాల్లో ఉప సర్పంచుల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల శిలాఫలకాలపై ఉప సర్పంచుల పేర్లను కూడా పొందుపర్చాలని అన్నారు. అదేవిధంగా మండల స్థాయి సర్వసభ్య సమావేశాలకు ఉప సర్పంచులను ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సర్పంచులకు చైర్మన్ బాధ్యతలు అప్పగించిన విధంగానే ఉప సర్పంచులకు వైస్ చైర్మన్ బాధ్యతలు కల్పించాలని కోరారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ కమిటీల్లోనూ ఉప సర్పంచులకు వైస్ చైర్మన్ హోదా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉప సర్పంచులు గ్రామాభివృద్ధిలో భాగస్వాములుగా పనిచేస్తున్నప్పటికీ తమకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత లభించడం లేదని పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచులు చాహకాటి లక్ష్మణ్, ముకుందరావు, గణపత్, సోయం రాజు, భీమ్ రావు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టతే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

ఉద్యమ కెరటం, సత్తుపల్లి: ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ కమిటీలను అధికారికంగా ప్రకటించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సత్తుపల్లి మండల, పట్టణ, వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ కమిటీలను ప్రకటించారు. ఖమ్మం జిల్లాలోనే తొలిసారిగా సత్తుపల్లి మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీలను ప్రకటించడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు బిమిరెడ్డి సుబ్బారెడ్డి గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేస్తూ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు అభినందించారు. అదేవిధంగా సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన గాదె చెన్నారావును ప్రశంసించారు.వేంసూరు మండలంలో పార్టీని బలోపేతం చేస్తూ అన్ని గ్రామాలను సమన్వయం చేసుకుంటూ కమిటీల ఏర్పాటులో చురుకైన పాత్ర పోషిస్తున్న మండల కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డిని నాయకులు అభినందించారు. మండలంలోని అన్ని గ్రామాల అధ్యక్షులు, కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గ్రామంలోని ప్రతి ఒక్కరికీ చేరవేయాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి



చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీని దేశ ప్రధాన మంత్రిగా చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్, మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వేంసూరు మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు, ఎన్ఎస్యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

19 నుంచి 'ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం' శిబిరాలు

జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: జిల్లాలో ఈనెల 19వ తేదీ నుంచి 'ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం' పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం' అమలుకు సంబంధించిన శిబిరాల నిర్వహణ, ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన టెలి కాన్ఫరెన్స్ ద్వారా పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం కార్యక్రమం జిల్లాలో ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభమై ఒక నెల రోజుల పాటు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ పథకం పకడ్బందీ అమలుకు సంబంధించి అవసరమైన చర్యలు చేపట్టాలని, క్యాంపుల నిర్వహణలో భాగంగా ప్రతి



గ్రామ పంచాయతీకి లేదా వార్డుకు ఒక అధికారిని ప్రత్యేకంగా నియమించాలని ఆదేశించారు. అలాగే, మూడు లేదా నాలుగు గ్రామ పంచాయతీలకు కలిపి ఒక ప్రత్యేక అధికారిని పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేయడంతో పాటు, మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాల్సి ఉంటుందని అధికారులకు సూచించారు. దరఖాస్తు ప్రక్రియలో ఫారమ్‌లలో రేషన్ కార్డు డేటా ఆటోమేటిక్‌గా వస్తుందని, ఆ సమాచారం ఉన్నవారి వద్ద కేవలం నామినీ వివరాలు నమోదు చేసి, లబ్ధిదారుల నుంచి సంతకం తీసుకొని ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. అయితే, నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో లేదా ఫారమ్‌లో వివరాలు రాని పక్షంలో, భౌతికంగా ఫారమ్‌లను ప్రింట్ తీసుకుని, వాటిపై లబ్ధిదారుల నుంచి సంతకాలు సేకరించాలని ఆదేశించారు.ఈ టెలి కాన్ఫరెన్స్ లో డిఆర్డీఓ రవీందర్, జెడ్పీ సీఈఓ రవి, డిపిఓ రమేష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఇతర సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలులో అర్హతే ప్రామాణికం

- అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

ఉద్యమ కెరటం, మంచిర్యాల: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ, అర్హత ఉన్నవారిని గుర్తించి లబ్ధి చేకూర్చాలని స్పష్టం చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో ఉన్న పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో నూతనంగా మంజూరైన చేయూత ఆసరా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, హాజీపూర్ ఎంపీడీఓ, మార్కెట్ కమిటీ చైర్మన్ బానేష్‌లతో కలిసి కలెక్టర్ హాజరై లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, దివ్యాంగులు, డయాలసిస్ రోగులు, ఫైలేరియా, తలసేమియా, సికిల్ సెల్, హీమోఫీలియా వ్యాధిగ్రస్తులు తదితర అర్హులైన వర్గాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం





కొత్తగా ఆసరా పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 10వేల మందికి పైగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించామని, మంజూరైన పింఛన్ల ఆర్థిక ప్రయోజనాలు డిసెంబర్ నుంచి అందే అవకాశం ఉందని వివరించారు. కొన్ని దరఖాస్తులను మరింత పరిశీలన కోసం పెండింగ్‌లో ఉంచినట్లు తెలిపారు. దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి సదరం ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన అనంతరం అర్హతను పరిశీలించి మంజూరుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వైద్య మండలి నిబంధనల ప్రకారం 40 శాతం, అంతకంటే ఎక్కువ దివ్యాంగత్వం ఉన్నవారికే సదరం ధ్రువపత్రాలు జారీ అవుతాయని అన్నారు. దివ్యాంగులకు పింఛన్‌తో పాటు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, రైల్వే ప్రయాణ రాయితీలు వంటి ప్రయోజనాలు కూడా వర్తిస్తాయని పేర్కొన్నారు. అర్హత లేని వారు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించడం, దివ్యాంగత్వ శాతాన్ని మార్చేందుకు ప్రయత్నించడం చట్ట పరమైన ఇబ్బందులకు దారితీస్తుందని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర సంక్షేమ పథకాల అమలులోనూ ప్రభుత్వం నిర్దేశించిన అర్హత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. అర్హత ఉన్నప్పటికీ పింఛన్, ఇతర సంక్షేమ పథకాలు అందని వారు సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. అక్టోబర్ 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్న వారిలో నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం 2,509 మంది లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఇందులో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2,261 మందికి, హాజీపూర్ మండల పరిధిలో 248 మందికి పింఛన్ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నూతన పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ ఉద్యోగులకు అండగా నిలుస్తాం

- ఉద్యోగులకు అన్యాయం జరిగితే పోరాటం తప్పదు
- టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి
- మాతా శిశు ఆసుపత్రిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం

ఉద్యమ కెరటం, కరీంనగర్: ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే టీఎన్జీవోల సంఘం ప్రధాన లక్ష్యమని సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్ మాతా శిశు ఆసుపత్రిలో భోజన విరామ సమయంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నర్సింగ్ అధికారులు, నర్సింగ్ సూపరింటెండెంట్లకు సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీఎన్జీవోల సంఘంలో సభ్యత్వం అంటే కేవలం సభ్యత్వ రుసుము వసూలు చేయడం కాదని, నిబద్ధత కలిగిన ఉద్యోగులను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి హక్కుల కోసం పోరాడటమని పేర్కొన్నారు. ఎనిమిది దశాబ్దాల చరిత్ర కలిగిన సంఘం



ఉద్యోగుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. నర్సింగ్ ఉద్యోగులు ప్రజల ప్రాణాలను కాపాడే సేవా సైనికులని కొనియాడారు. కరోనా, విషజ్వరాల వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించారని గుర్తుచేశారు. అలాంటి ఉద్యోగులకు ఎలాంటి సమస్య ఎదురైనా సంఘం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో ఆటంకాలు ఎదురైనా, ప్రభుత్వపరంగా రావాల్సిన హక్కులకు భంగం కలిగినా న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. సంఘం క్రమశిక్షణ, ఐక్యతకు మారుపేరని, ప్రతి ఉద్యోగి అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సంఘం గౌరవాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, నాయకులు కమలాకర్, లవకుమార్, కరుణాకర్, నారాయణ, గుండ రాజేష్, బండ అన్వేష్, ప్రకాశం, రాహేల్, రాజేష్, దిలీప్, ఉదయ్, సరోజ, రాధిక, షెర్లీ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

రూ.5లక్షల చెక్కు అందించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్



ఉద్యమ కెరటం, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వెంగల వెంకటేశం ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యుల ఆర్థిక ఇబ్బందులు గమనించి రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేసింది. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం వెంగల వెంకటేశం భార్య సులోచనకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ చెక్కును అందజేశారు. తమ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి వెంగల సులోచన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పర్యవేక్షకులు ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

- ఏఎంసీ నూతన చైర్మన్ చల్లగుండ్ల నరసింహారావు ప్రమాణ స్వీకారం



ఉద్యమ కెరటం, సత్తుపల్లి: రైతుల అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ పనిచేస్తుందని నూతన చైర్మన్ చల్లగుండ్ల నరసింహారావు అన్నారు. రైతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అంకిత భావంతో కృషి చేస్తానని తెలిపారు. సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా చల్లగుండ్ల నరసింహారావు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన చైర్మన్‌తో పాటు డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో నెలకొన్న పరిస్థితులు, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సాగు భూములను పరిశీలించాలని, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సహకారంతో రైతులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఏ పంటలు సాగు చేయాలి, ఎలాంటి వ్యవసాయ పద్ధతులు పాటించాలి అనే అంశాలపై తగిన సూచనలు అందించాలని తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను రైతులకు వివరించాలని కోరారు. అంతకుముందు నూతన చైర్మన్ చల్లగుండ్ల నరసింహారావుకు మద్దతుగా సత్తుపల్లి పట్టణంలోని జలగం వెంగళరావు పార్కు నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేరింతలు, చప్పట్లు, హర్షధ్వానాల మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం చల్లగుండ్ల నరసింహారావు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల సంక్షేమం కోసం అందరినీ కలుపుకొని పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, సత్తుపల్లి పట్టణ వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, రూరల్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



ఉద్యమ కెరటం, సిరిసిల్ల: శ్రీకృష్ణుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతిఒక్కరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో జీవించాలని యాదవ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు దేవేందర్ యాదవ్ ఆకాంక్షించారు. సిరిసిల్ల పట్టణంలోని చిన్న బోనాల గ్రామంలో కొలువు దీరిన శ్రీ రుక్మిణి వేణుగోపాల కృష్ణ స్వామి ఆలయ 11వ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు సోమవారం ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కొక్కు దేవేందర్ యాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో భక్తిభావం, ఐక్యత, సోదరభావం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు.